J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 11 18.8.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# మజా ఇస్తున్న మత్తు.. పల్లె యువత చిత్తు

## నగరాల నుంచి గ్రామాలకూ చేరుతున్న విష సంస్కృతి

## గంజాయికి బానిసలవుతున్న టీనేజర్స్

ఇన్నాళ్లూ మహానగరాలకే పరిమితమైన మత్తు ఇప్పుడు మారుమూల గ్రామాలను సైతం ఆవహించింది. ఒకప్పుడు కేవలం మద్యం అనే మహమ్మారికి అలవాటు పడిన పల్లెవాసులు ఇప్పుడు మాదకద్రవ్యాలకు కూడా బానిసలవుతున్నారు. తాగిన మత్తులో కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లిని, కట్టుకున్న ఆలిని, కడుపున పుట్టిన బిడ్డలను కూడా కర్కశంగా కడతేర్చడానికి తెగబడుతున్నారు. ఈ మత్తులోనే ప్రమాదాలకు గురవుతూ నిండు ప్రాణాలను బలిగొంటున్న సంఘటనలు తరచూ జరుగుతూనే వున్నాయి. మత్తు, మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత వాటిని చేజిక్కించుకోవడానికి ఎంతటి దారుణాలకైనా తెగబడుతోంది. డబ్బుల్లేకపోతే దొంగతనాలకు పాల్పడుతున్నారు. మత్తుకు అలవాటైన ఓ యువకుడు అవసరానికి డబ్బులు ఇవ్వలేదని కన్నతల్లిని కడతేర్చిన సంఘటన, మత్తులో తన నగ్నచిత్రాలను అమ్మకానికి పెట్టిన ఓ విద్యార్థిని ఉదంతం మనం చూశాం, చదివాం, విన్నాం. ఇలాంటివే అనేకం నిత్యం జరుగుతూనే ఉన్నాయి. ఈ మత్తులో లక్షల కుటుంబాలు చిత్తవుతున్నాయి.

### పసిప్రాయం నుంచే గంజాయి!

విద్యాలయాలు సైతం మాదక ద్రవ్యాలకు నిలయాలుగా మారిపోతున్నాయి. ఒకప్పుడు మహానగరాలలో కార్పొరేట్ స్థాయిలో ఉన్న ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కళాశాలలకే పరిమితమైన డ్రగ్స్ సంస్కృతి, ఇప్పుడు పట్టణస్థాయిలోని కాన్వెంటు స్కూళ్ళకి కూడా పాకిందంటే అతిశయోక్తి కాదు.

10 లో

## ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా వై.ఎస్.షర్మిల?

### కర్నాటక నుండి రాజ్యసభకు!

3 లో



N.B.K.R. INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
(AUTONOMOUS)
Estd:1979
Affiliated to JNTUA, Ananthapuramu
Vidyanagar, Tirupati Dt. Phone : 8985382247, www.nbkrist.org

OUR CREDENTIALS

EAPCET CODE NBKR

Courses accredited by NBA under tier - 1
Accredited by NAAC with 'A' grade
Accorded 'A' grade by Government of AP
College with Potential for Excellence
Robotics Research & Training Center

ICT ACADEMY Premier Member
TATA TCS Accredited Institution
SAEINDIA Collegiate Club
CYIENT Empaneled Institution
MEIDEN Japanese Skill Transfer Programme

Courses Offered: B.Tech.
•CSE •CSE (AI & ML)
•CSE (DS) •AI & DS •IT
•ECE •EEE
•MECHANICAL •CIVIL

COLLEGE BUS FACILITY FROM
Nellore | Gudur | Naidupeta | Sullurupeta | Tada | Venkatagiri
Muthukuru | Mallam | Podalakuru | Rapuru, Sydapuram & Srikalahasti

• Year-wise separate hostel facility for boys
• Well - protected enclosed hostel for girls

N.C.C.
ARMY WING
NAVAL WING


NEDURUMALLI RAMKUMAR
CORRESPONDENT



# శ్రీ అష్టలక్ష్మీదేవి ఆలయంలో.. శ్రావణమాసం పూజలు

నెల్లూరు దర్గామిట్టలోని సుజాతమ్మకాలనీలో కొలువైవున్న శ్రీ అష్టలక్ష్మీదేవి ఆలయంలో ఈనెల 17 నుంచి సెప్టెంబరు 15వ తేది వరకు అత్యంత వైభవంగా శ్రావణమాసం పూజలు జరుగుతాయి. శ్రావణమాసంలో అయిదు శుక్రవారాల పాటు ఈ విశేష పూజలు కొనసాగుతాయని శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ప్రతి శ్రావణ శుక్రవారం ఉదయం నుంచి శ్రీ స్వర్ణ మహాలక్ష్మి అమ్మవారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తికి క్షీరాభిషేకం ఉంటుందని, శ్రీ చక్రార్చన వంటి విశిష్ట పూజలు జరుగుతాయని తెలిపారు. ఆయా రోజుల్లో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకారాలు, కుంకుమపూజలు, సామూహిక వరలక్ష్మీవ్రతం, అష్టలక్ష్మి హోమం, శ్రీ ధనలక్ష్మీ కుబేర హోమం, చండీ హోమం తదితర విశిష్టపూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 31న శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణ భగవానునికి పుష్పాభిషేకంతో పాటు, రుద్రహోమం, అష్టలక్ష్మీ హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెప్టెంబరు 1న మూడవ శుక్రవారం రోజున సహస్ర కలువపూలతో అర్చన, సెప్టెంబరు 6న శ్రీకృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొని ఆ భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈనెల 12న ఆమేరకు అమ్మవారి పూజల విశేషాలను తెలియజేస్తూ ఆహ్వానపత్రికలను ఆలయ ట్రస్టీలు డాక్టర్ అజయ్, అనపల్లి మస్తాన్‌రెడ్డి, సురేష్, ఆలయ అర్చకులు ఆవిష్కరించారు.

# చిన్నారులకు టీకాలు

ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబరు 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14వ తేది వరకు చిన్నారులకు రోగ నిరోధక టీకాలు వేసేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 'మిషన్ ఇంద్రధనుస్సు' కార్యక్రమంలో భాగంగా మూడు నెలల పాటు నెలలో ఆరు రోజుల వంతున టీకాలు వేసేందుకు అధికారులు, సిబ్బంది సమాయత్తమయ్యారు. ఈనెల 12న జిల్లాలోని మనుబోలు పిహెచ్‌సిని తనిఖీ చేసిన సందర్భంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య చిన్నారులకు రోగనిరోధక టీకాలు వేయడం ఎంత ముఖ్యమో సిబ్బందికి సూచించారు. అనుకున్న లక్ష్యం ప్రకారం టీకాలు వేయాలని, ఎవరూ అశ్రద్ధ వహించరాదని సిబ్బందిని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుబ్బరాజు, గేయపూజిత, సిహెచ్‌ఓ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఔన్నత్యాన్ని చాటేందుకే.. 'నా భూమి-నా దేశం'

## - జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

భారతీయులంతా ఒక్కటేనని, దేశ ఔన్నత్యాన్ని చాటేందుకే 'నా భూమి-నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చెప్పారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న నెల్లూరులో 500 మీటర్ల భారీ జాతీయ జెండాను ఆమె ఆవిష్కరించి, స్థానిక విఆర్ కళాశాల వద్ద నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు 'వందేమాతరం-మాదే ఈ తరం' అంటూ నినాదాలు చేస్తూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. భరతమాత చిత్రపటాన్ని ముందు నిలిపి, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, డా.అంబేద్కర్ తదితర స్వాతంత్రయోధుల వేషధారణలతో విద్యార్థులు ఈ ర్యాలీలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బ్రిటీష్ దాస్యశృంఖలాల నుంచి భారతదేశం విముక్తిపొంది 76 సంవత్సరాలు పూర్తయిన వేళ భారతీయులంతా దేశభక్తితో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాలు చేపట్టడం, తద్వారా దేశ ఐక్యతను చాటి చెప్పడం స్ఫూర్తిదాయకమన్నారు. 'నా భూమి-నా దేశం' కార్యక్రమంతో ప్రజల్లో స్ఫూర్తిని కలిగించామన్నారు. జడ్పీ సిఇఓ చిరంజీవి, డిపిఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 'సెబ్' అధికారిగా దయాసాగర్



జిల్లా సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారిగా దయాసాగర్ నియమితులయ్యారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని సెబ్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. చిత్తూరుజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉన్న దయాసాగర్ పదోన్నతిపై నెల్లూరుజిల్లా సెబ్ అధికారిగా బదిలీ అయి వచ్చారు. ఈ సందర్భంగా సెబ్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రముఖులకు సత్కారం



ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు పద్మశ్రీ డాక్టర్ దాసరి ప్రసాద్‌రావు, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరిలను ఇటీవల నెల్లూరులో ఏపీయుడబ్ల్యుజె నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, 'సామ్నా' ప్రధాన కార్యదర్శి హనోక్‌తో పాటు, సురేంద్రరెడ్డి, అరవ రామ్మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమాలకు బియ్యం వితరణ



నెల్లూరు రూరల్ మండలం పరిధిలోని బుజబుజనెల్లూరు, నక్కలకాలనీల్లో ఉన్న వృద్ధాశ్రమాలకు, పొదలకూరురోడ్డులో ఉన్న హరిత వృద్ధాశ్రమానికి దాతలు ఈనెల 12న బియ్యం బస్తాలను తమ సాయంగా అందజేశారు. డైకస్‌రోడ్డులో యలమందరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన సతీమణి యశోద, కుటుంబసభ్యుల సహకారంతో, స్థానిక రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు షేక్ రసూల్, పిఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరుల ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. గోరంట్ల శేషయ్య, రాజేశ్వరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కంటి ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు




కంటివ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, కళ్ళ ఆరోగ్యం విషయంలో ఏమరుపాటు తగదని, డాక్టర్ నిహారిక అన్నారు. ఇటీవల నెల్లూరులోని కొండాయపాలెం అబైడింగ్ ట్రస్ట్‌లో జరిగిన కంటి వైద్య శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊహ తెలియని చిన్నపిల్లలు కళ్లపై అశ్రద్ధ వహించి ఆటలపై దృష్టితో కళ్ళను పోగొట్టుకునే ప్రమాదం ఉందని, తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. చిన్నపిల్లలకు కళ్ళకలక ఇతర అంటువ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ నిర్మల్‌కుమార్ 18 నెలల నుండి పేదలకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమని ప్రముఖ కంటి వైద్యనిపుణుడు డాక్టర్ ప్రేమ్‌చంద్ కొనియాడారు. ట్రస్ట్ అధ్యక్షుడు నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 50మందికి ఒక నెలకు సరిపోయే పౌష్టికాహారం ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, శివ, క్రాంతి, సిస్టర్ రమా, సిస్టర్ జయ, నిఖిల్, రూత్ బినోమి తదితరులు పాల్గొన్నారు.



# నేనే మీ... దేశాన్ని!

పిల్లలుగా మిమ్ము లాలించేదాన్ని
న్యాయం తప్పక పాలించేదాన్ని
కులమతాల గోడలు వద్దు
పాడి పంటలే మనకు ముద్దు.

పచ్చని చెట్లతో విరిసే ప్రగతిని నేను
పచ్చదనానికి నిలయం నేను
సంస్కృతి ఇక్కడ విలసిల్లేను
మానవీయత ఎల్లెడలా వర్ధిల్లేను

ఎందరి వీరుల త్యాగ ఫలం
ఎందరి రక్తపు శౌర్య ఫలం.
స్వాతంత్ర్యం ఏ ఒక్కరికో కాదు
అమ్మకు అందరూ ఒకటే చూడు

చిన్నవారిని అణిచివేయక,
తక్కువ వారని అలుసుచేయక,
అందరమొకటై ఐక్యంగా నిలవాలి
స్వతంత్ర భారతిని ఆదర్శంగా నిలపాలి.
ప్రతి తల్లీ గర్వపడేవిధంగా
మన తల్లి భారతమాతకు జైకొట్టాలి..

**- ఎం. కోమల (ఎంపీసీ)**
అంబేద్కర్ గురుకులం, పుదూరు, తిరుపతిజిల్లా.

# మోయలేని భారంగా.. విద్యుత్‌బిల్లులు


విద్యుత్ బిల్లులు సామాన్యప్రజలకు మోయలేని భారంగా తయారవుతున్నాయని, వినియోగదారులు ఆ బిల్లులను చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారని, జగన్ సర్కార్ వెంటనే బిల్లులు తగ్గించాలని నమామి గంగే ప్రతినిధి, బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్‌బిల్లుల కంటే ఇంధన కొనుగోలు, ట్రూఅప్ చార్జీల భారం మరింత ఎక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు. బొగ్గు కొనుగోలు చార్జీలను వినియోగదారులపై మోపడం భావ్యం కాదన్నారు.

# ఉపకార వేతనాలకు.. బయోమెట్రిక్ తప్పనిసరి

కేంద్రప్రభుత్వం 2022-23 సంవత్సరానికి మైనార్టీ విద్యార్థులకు మంజూరుచేసే ఉపకార వేతనాల కోసం బయోమెట్రిక్ నమోదుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఆయా విద్యాసంస్థలు తప్పనిసరిగా తమ ఆధార్ తదితర ధ్రువీకరణ పత్రాలతో వచ్చి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ చేసుకోవాలని ఆ శాఖ అధికారిణి డా. నిర్మలాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 89772 26123 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని కోరారు.

# ఉపాధ్యాయ నేతగా సంపత్‌కృష్ణ

రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షునిగా నెల్లూరుకు చెందిన ఎన్.సంపత్ కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పరిషత్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు ఇటీవల నెల్లూరులోని ఎన్‌జిఓ కార్యాలయంలో నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ప్రకాశం జిల్లాకు చెందిన ఎం.రవిచంద్రకుమార్, కోశాధికారిగా ఏలూరుకు చెందిన టి.రాజాబాబు ఎన్నికయ్యారు. ఎన్నికల పర్యవేక్షకునిగా కృష్ణశాస్త్రి వ్యవహరించారు.




● కీలకఘట్టం ముగిసింది

మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడివడే క్లిష్టమైన ప్రక్రియ కూడా విజయవంతమైంది

ఆగస్టు 23వ తేది సా. 5.47కు ల్యాండర్ చంద్రునిపై అడుగిడనుంది

# అదిగదిగో చందమామ!..చాలా దగ్గరికొచ్చేశాం

చందమామను చూసేందుకు మనం పంపిన చంద్రయాన్ మిషన్ ఆ వెన్నెలరేడు కక్షలోకి బాగా చేరువలోకి చేరింది. చంద్రుని మీదకు దిగేందుకు అత్యంత ముఖ్యమైన ఆపరేషన్ బుధవారం నుంచి ప్రారంభమైంది. చంద్రయాన్ మిషన్‌లోని పొప్రెల్షన్ మాడ్యూల్ నుంచి విక్రమ్ ల్యాండర్ విడివడింది. శాస్త్రవేత్తలు విజయవంతంగా ఈ ప్రక్రియను చేపట్టినట్టు ఇస్రో ప్రకటించింది. దీంతో చంద్రయాన్ వ్యోమనౌక చంద్రుడికి మరింతగా చేరువైంది. బెంగుళూరులోని మిషన్ ఆపరేటర్ కాంప్లెక్స్, ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్, బైలాలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ వంటి భూనియంత్రతి కేంద్రాల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతో క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను జయప్రదంగా నిర్వహిస్తున్నారు. మాడ్యూల్ నుంచి ల్యాండర్ విడిపోవడంతో, ల్యాండర్‌లో ఉన్న ఇంధనాన్ని మండించి ఈనెల 19, 21 తేదీల్లో కూడా ప్రత్యేక ఆపరేషన్ చేపట్టేందుకు శాస్త్రవేత్తలు మరింత ఉత్సాహంతో సమాయత్తమయ్యారు.

గత నెల 14న శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి పంపిన ఎల్‌వీఎం3-ఎం4 రాకెట్ విజయవంతంగా చంద్రయాన్ మిషన్-3ను నిర్ధేశిత కక్ష్యలోకి చేర్చడం, అది భూకక్ష్యను దాటి చంద్రుని కక్ష్యలోకి వెళ్ళి నిర్విఘ్నంగా ప్రయాణిస్తుండడం పట్ల ఇస్రో శాస్త్రవేత్తలు ఆనందం వ్యక్తం చేశారు. చంద్రుడి ఉపరితలంపైకి చంద్రయాన్ మిషన్-3 కక్ష్యను జాబిల్లికి మరింత దగ్గరగా పంపేందుకు అవసరమైన ప్రక్రియలన్నీ శరవేగంగా చేపట్టారు. ఈనెల 16న చంద్రయాన్ మిషన్ కక్ష్య దూరాన్ని అయిదవసారి పెంచే ప్రక్రియను కూడా శాస్త్రవేత్తలు నిర్వహించడంతో, ప్రొపెల్షన్ మాడ్యూల్ నుంచి రోవర్‌తో కూడిన ల్యాండర్ మాడ్యూల్ విడివడి.. ఆ ఘట్టం కూడా విజయవంతంగా పూర్తయింది. ఇప్పుడు చంద్రయాన్ మిషన్ చంద్రుడి చుట్టూ 153-163 కిలోమీటర్ల స్వల్ప దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతోందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. చంద్రుడి ఉపరితలం నుంచి వంద కిలోమీటర్ల దూరంలో కక్ష్యలోకి చంద్రయాన్ మిషన్ చేరుకుంది. ఇక, అందరూ వేయికళ్ళతో ఎదురుచూసే అద్భుతమైన ఘట్టంలోకి చేరుకునేందుకు సమయం ఆసన్నమైంది. ఆగస్టు 23వ తేది సాయంత్రం సరిగ్గా 5.47 గంటలకు విక్రమ్ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై ఉన్న దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టే చరిత్రాత్మక ఘట్టం కోసం అందరూ నిరీక్షిస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల?

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలిగా షర్మిలను నియమించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం సూచించినట్లే తన వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌పార్టీలో విలీనంచేసి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ సారధిగా ఉండడానికి షర్మిల సూచనప్రాయంగా అంగీకరించినట్లు విశ్వసనీయ సమాచారం. సెప్టెంబర్ 2లోగా ఈ తంతు పూర్తి చేయాలని కాంగ్రెస్‌వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయవర్గాలలో చర్చ నడుస్తోంది. షర్మిలను కర్ణాటక నుండి రాజ్యసభకు పంపడంతో పాటు ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా ప్రకటించనున్నారని అంటున్నారు. షర్మిలకు ఆంధ్రప్రదేశ్ పగ్గాలు అప్పజెప్పడంతో పాటు డాక్టర్ రాజశేఖరరెడ్డితో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండి జగన్ మోహన్‌రెడ్డికి దూరంగా ఉన్న కొందరు కీలక నేతలకు పార్టీలో ముఖ్య భూమిక అప్పజెప్పి షర్మిలకు తోడుగా జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రచార అస్త్రంగా ప్రయోగించాలని పార్టీ భావిస్తున్నట్లు కూడా గుసగుసలు వినపడుతున్నాయి.



వార్తలు వస్తున్నట్లుగా ఇలా జరిగితే రాష్ట్ర రాజకీయాలలో ఇదొక కొత్త పరిణామం. కాంగ్రెస్‌కి ప్రధాన శత్రువు జగనే, అంటే షర్మిల అనే బాణాన్ని కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు ఆమె అన్నపైనే ఎక్కుపెట్టే ప్రయత్నం చేయబోతోంది.

ఈ వ్యవహారమంతా కర్ణాటక కాంగ్రెస్ నాయకుడు డీకే శివకుమార్ ఆధ్వర్యంలో జరుగుతోందని కూడా అంటున్నారు.

ఇదే నిజమైతే రాబోయే రోజుల్లో వైఎస్ కుటుంబ పోరు పూర్తిస్థాయిలో బజారుకెక్కడం ఖాయం. ఇప్పటికే వైఎస్ వివేకా హత్య ఉదంతంలో ఆ కుటుంబం రచ్చకెక్కింది. రేపు షర్మిల రోడ్లపైకి వచ్చి నోరు విప్పితే ఇంటి గుట్టు రట్టవ్వడం ఖాయం అంటున్నారు విశ్లేషకులు.

భాజపా తమపార్టీ అధ్యక్షురాలిగా పురందేశ్వరిని నియమించింది. కాంగ్రెస్ కూడా వ్యూహాత్మకంగానే షర్మిలని బరిలో దించాలని నిర్ణయించుకున్నట్లుందంటున్నారు మేధావులు. ఒకవేళ ఇది జరిగితే నిన్నటి వరకు తాను తెలంగాణ బిడ్డనని పోరాటం సాగించిన షర్మిలమ్మ ఇప్పుడు తన రాకను ఎలా సమర్థించుకుంటుందో వేచి చూడాలంటున్నారు రాజకీయవాదులు.

# జర్నలిస్టుల రక్తదానం



ఏపియుడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఆగస్టు 17వతేదీ గురువారం ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న సీనియర్ జర్నలిస్టు, విశాలాంధ్ర బ్యూరో దయాశంకర్, పక్కనే శాసనమండలి సభ్యుడు, రెడ్ క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖరరెడ్డి.

# రాంబాబుకి జాతీయ స్థాయి పోలీస్ మెడల్

నెల్లూరు సీఐడి విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న వాకా శ్రీరాంబాబుకి 2022 సంవత్సరంలో ఆయన అందించిన సేవలకు గుర్తుగా జాతీయస్థాయి 'ఇండియన్ పోలీస్ మెడల్' లభించింది. ఆగస్టు 15, 2023 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన వేడుకలలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాంబాబు ఈ మెడల్ అందుకున్నారు. గత మూడున్నర దశాబ్దాలకుపైగా



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా మెడల్ అందుకుంటున్న వి.ఎస్.రాంబాబు

పోలీసుశాఖలో వివిధ హోదాలలో పనిచేసిన రాంబాబు తన పదవీకాలంలో ఇంకా అనేక ప్రతిష్టాత్మక పతకాలను కూడా సాధించారు. 2003లో సేవాపతకం, 2010లో ఉత్తమ సేవా పతకంతో పాటు 2018లో ఉత్కృష్ఠ సేవా పతకాన్ని రాంబాబు తన సొంతం చేసుకున్నారు. ఇవికాక రెండువందల రివార్డులు, 15 ప్రశంసా పత్రాలను రాంబాబు వివిధ సందర్భాలలో తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో 'ఇండియన్ పోలీస్ మెడల్' ఆయనని వరించింది. నెల్లూరుజిల్లాలో పలు హోదాలలో పనిచేసి ప్రస్తుతం సీఐడి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వీ.ఎస్.రాంబాబు జిల్లావాసులకు సుపరిచితులే. ప్రతిభాశాలికి 'లాయర్' అభినందనలు.

# 19న స్థానిక ఎన్నికలు

జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక సర్పంచ్, మరో 11 వార్డు స్థానాలకు ఆగస్టు 19న పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. జలదంకి మండలం లింగరాజు అగ్రహారం సర్పంచ్ స్థానానికి, జలదంకి, కోవూరు, ఉలవపాడు, కొండాపురం, లింగసముద్రం, మనుబోలు, చేజర్ల, రాపూరు తదితర మండలాల్లో ఖాళీగా ఉన్న 12 వార్డు స్థానాలకు ఆరోజున పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించిన అనంతరం, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



## నాణ్యమైన పట్టుచీరలకు..

# కాంచీపురం నారాయణి సిల్క్స్

నాణ్యతగల పట్టుచీరలు, రంగుల హంగులతో, ముచ్చటైన డిజైన్లతో ఉండే అందమైన చీరలు కావాలనుకునేవారిని బాగా ఆకట్టుకుంటోంది నెల్లూరులోని 'కాంచీపురం నారాయణి సిల్క్స్ షోరూమ్'. నగరంలో ఈ వస్త్రాలయం కొత్తగా ఏర్పాటైంది. మాగుంట లేఅవుట్‌లో డా.బెజవాడ గోపాలరెడ్డి సర్కిల్ (మినీబైపాస్‌రోడ్డు) వద్ద ఉన్న ఈ షోరూమ్‌లో ప్రసిద్ధమైన కంచి పట్టుచీరలు, ధర్మవరం చీరలు, ఆరణి, గద్వాల్, కోటా, పోచంపల్లి, మహేశ్వరి, కోయంబత్తూర్, బెనారస్‌చీరలు, చందేరి వెరైటీల చీరలు మొదలుకుని దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చేనేతకారులు నైపుణ్యంతో, కళాత్మకతతో రూపుదిద్దిన అనేకరకాల చీరలు వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా నాణ్యతగానే కాక, సరసమైన ధరలకు లభిస్తుండడంతో ఈ షోరూమ్ వినియోగదారులతో కళకళలాడుతోంది. దేశంలో పేరొందిన ప్రముఖ వస్త్ర వ్యాపారులు పివిఎస్ అభినయ్, సురేశ్ శీర్ణ, టి.కేశవ్ గుప్తా, టి.రాకేశ్‌ల సారధ్యంలో పట్టుచీరలకు బ్రాండెడ్‌గా ఉన్న ఈ షోరూమ్‌లో పురుషుల కోసం విలాసవంతమైన డి.రాయల్ బ్రాండ్ ఎత్నిక్‌వేర్ కూడా అందుబాటులో ఉండడం విశేషం. ఇటీవలే ఈ షోరూమ్‌ను ప్రముఖ సినీనటి ప్రగ్యా జైస్వాల్ చేతులమీదుగా ప్రారంభించడం, రాష్ట్రంలోని కాంచీపురం నారాయణి సిల్క్స్ సీరీస్‌లో ఇది 7వది కావడం మరో విశేషం.

లాయర్
ఆగస్టు 18, 2023

# మళ్లీ మరో స్వాతంత్ర్యం రావాలి

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా మనకొచ్చిన స్వాతంత్ర్యానికి 76 ఏళ్ళు నిండాయి. ఇది 77వ స్వాతంత్ర్య దినోత్సవం. భరతమాత స్వేచ్ఛావాయువులతో పులకిస్తున్న కాలమిది. ఇన్నేళ్ళ స్వాతంత్ర్యంలో ఎన్నో అనుభవాలు, ఎన్నో మైలురాళ్ళు దాటుకుంటూ వచ్చాం. తెల్లదొరల పాలనలో ఎన్నెన్ని ఘోరాలో చెప్పలేం. వారి భయంకర హింసలకు ఎందరి ప్రాణాలు అనంతవాయువుల్లో కలిశాయో లెక్కేలేదు. తగిలిన గాయాలను మాన్పుకుంటూ దేశం మెల్లమెల్లగా కోలుకుంటూ ప్రగతి పథం వైపు నడుచుకుంటూ వస్తున్న కాలమిది. ఇన్నేళ్ళ కాలంలో దేశం ఎంతోకొంత పురోభివృద్దిని సాధించింది కూడా. అంతమాత్రానికే జెండా ఎగరేసి సంబరపడిపోతూ చాలా సాధించేశామని మిఠాయిలు పంచుకుంటున్నాం! అయితే, ఆ సాధించిన దానికే సంతోషపడిపోదామా!..

దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాలనే అర్పించిన పూజ్య బాపూజీ వంటి మన జాతి నేతలు కలలుకన్న స్వరాజ్యం మనకు సిద్ధించిందా?.. వారి కలలు సాకారమయ్యాయా?.. అంటే సమాధానం శూన్యం. అందరికీ సమాన స్వేచ్ఛ ఉండాలని, సమతాభావం..సోదరభావంతో అందరూ ఐక్యంగా ఉంటూ దేశాభ్యున్నతికి బాటలు వేసుకోవాలని, కులాలు మతాల వైషమ్యాలు వద్దని, హింసకు తావివ్వవద్దని, దేశమంతా శాంతికాంతులు వెల్లివిరియాలని, ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలని స్వాతంత్ర్యయోధులు ఎన్నెన్ని కలలు కన్నారు. ఏళ్లు గడిచిపోతున్నా వారి కలలు ఫలిస్తున్నాయా?..అని ఎవరికి వారు ప్రశ్నించుకుని, భవిష్యత్తుని సమీక్షించుకోవాల్సిన సమయమిది. ఎంతో గొప్పగా, ప్రపంచానికే ఆదర్శంగా ఉండాల్సిన మన ప్రజాస్వామ్యం ఒక మేడిపండుగా తయారైంది. ఏళ్లుపూళ్ళు గడిచిపోతూనే ఉన్నా మన మహనీయనేతలు ఆశించిన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రజలకు లభించనే లేదు. నేటి నాయకుల మాటలన్నీ శుష్కవాగ్దానాలు, శూన్యహస్తాలుగానే ఉంటు న్నాయి. మరోవైపు దేశం నానాటికీ రకరకాల వైషమ్యాల వలలో చిక్కుకుపోతోంది. మత విద్వేషాలు, జాతులు, కులాల కుమ్ములాటలు పెరగడమే తప్ప తరిగిందెక్కడ? అరాచకాలు, అఘాయిత్యాలకు అంతే ఉండడం లేదు. నేటికీ మణిపూర్ మంటలు చల్లారడమే లేదు. ఓటు బ్యాంకు రాజకీయాలతో ప్రజలను మభ్యపెట్టి, నాయకులు పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ప్రజలకు శాంతి ఉండడం లేదు. తాము చెప్పిందే వేదమనే నిరంకుశ ప్రవృత్తి పాలకుల్లో పెచ్చరిల్లిపోతుండడంతో ప్రజాస్వామ్యం ఎండమావిగా మారిపోతోంది. దేశంలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోంది. అసాంఘికశక్తులు, నేరగాళ్ళు రాజకీయాల్లోకి వచ్చి ప్రజలను నానారకాలుగా కాల్చుకుతింటున్నారు. దేశంలోని దాదాపు 140 కోట్ల మంది ప్రజల జీవితాలను కొందరు రాజకీయనాయకులు తమ చిత్తానుసారం శాసిస్తున్నారు. నీతివంతమైన పాలన, పారదర్శక పాలన అనేవి మాటలకే తప్ప ఆచరణలో అడుగంటిపోయాయి. ప్రజల హక్కులు నల్లచట్టాల మాటున నలిగిపోతున్నాయి. మహిళలపై అత్యాచారాలు, హత్యాకాండలు, బాలికలపై అఘాయిత్యాలు అకృత్యాలు, పేద-బడుగు-బలహీన వర్గాలపై మూకదాడులు, దౌర్జన్యాలు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నాయి. దళితులు, అమాయక గిరిజనుల పట్ల అమానుషాలకు అంతే ఉండడం లేదు. దేశంలో నిరుద్యోగ రక్కసి జడలు విరబోసుకుంటోంది. దారిద్ర్యం ఎక్కువై ఆకలిచావులు, ఆత్మహత్యలకు దారితీస్తూనే ఉంది. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతూ సామాన్యుల అన్నం గిన్నెకు చిల్లులు పెడుతున్నాయి. ఇవేమీ పాలకుల కళ్ళకు కనపడవు. సమస్యల సుడిలో పడి ప్రజల జీవితం అంధకార బంధురమైపోతున్నా అంతా బాగానే ఉందంటూ నాయకులు కాలం వెళ్ళబుచ్చుతున్నారు. దేశంలో విద్య,వైద్యం, సేద్యం పరిశ్రమలతో పాటు అన్ని రకాల వ్యవస్థలు అవస్థల్లోనే మూలుగుతున్నాయి. అపారమైన ప్రకృతి వనరులన్నీ దోపిడీకి గురవుతూనే ఉన్నాయి. మరో నాలుగేళ్ళలో మనదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని, భవిష్యత్‌లో మనదేశం గొప్ప ధనిక దేశంగా మారుతుందని నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప, కోట్లాదిమంది అట్టడుగు ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారనే వాస్తవాన్ని అసలు పట్టించుకోవడం లేదు. తమ స్వార్థం, తమ లాభం, తమ అధికారం కోసం పాకులాడుతున్నారే తప్ప దేశంలోని సమస్యలను పరిష్కరించడంలో నాయకులు చిత్తశుద్ధి చూపడంలేదు. ఫలితంగా రైతుల బాధలు, నిరుద్యోగుల కష్టాలు, పేదల వెతలు, మొత్తంగా అత్యధికశాతం మంది ప్రజల సమస్యలు ఏళ్ళు గడుస్తున్నా తీరడమే లేదు. పైపెచ్చు దేశంలో అవినీతి విషవృక్షం ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోతూనే ఉంది. అక్రమార్జనపరులైన నాయకులు వేల కోట్ల రూపాయల్లో కుంభకోణాలకు పాల్పడుతూనే ఉన్నారు. చట్టాలను నిర్వీర్యం చేస్తూ ప్రజాపాలనను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూనే ఉన్నారు. దారిద్ర్యం, నిరుద్యోగం దేశమంతా తాండవిస్తుంటే అవన్నీ ఏమీ లేనట్టుగానే, అంతా బాగున్నట్లుగానే నాయకగణం మసిపూసి మారేడుకాయ చేస్తోంది. అదేమని ప్రశ్నించడం కూడా దేశద్రోహం కిందలెక్కగా తయారైపోతోంది.

ఇకనైనా ఈ దుస్థితి పోవాలి. అవినీతి, అకృత్యాలు, విద్వేషాలు, హింసలు, ఆకలి, కష్టాలు కన్నీళ్ళు, అసమానతలు అన్నీ సమసిపోవాలి. మన జాతినేతలు కోరుకున్నట్లుగా అందరూ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో హాయిగా జీవించే అసలైన ప్రజాస్వామ్యం ఊపిరిపోసుకోవాలి. ధర్మబద్ధమైన పాలనతో దేశంలో ప్రతిఒక్కరూ శాంతియుతంగా, సోదరభావంతో జీవించాలి. అందుకు మళ్ళీ మరో స్వాతంత్ర్యం రావాలి.

# అడుగడుగునా పరేషాన్.. నెల్లూరు రైల్వేస్టేషన్!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

నెల్లూరు రైల్వేస్టేషన్‌లో మరమ్మత్తులు జరుగుతున్నాయి. స్టేషన్‌ని అత్యాధునిక వసతులతో, నేటి కాలానికి అనుగుణంగా మోడల్ స్టేషన్‌గా రైల్వేశాఖ తీర్చిదిద్దబోతోందని అధికారులు చెప్తున్నారు. మంచిదే, అలా అని చెప్పి పనులు పూర్తయ్యేవరకు ప్రయాణికులను అవస్థల పాలు చేయడం ఎంతవరకు సమంజసం. ముందస్తు ప్రణాళిక, ఏర్పాట్లు లేకుండా ఇష్టాను సారంగా పాత స్టేషన్‌ని కూల్చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. పార్కింగ్ దగ్గర నుండి ప్లాట్ ఫారం దాకా అంతా గందరగోళమే. పార్కింగ్ ప్రదేశాల్లో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా డబ్బులు గుంజుతున్నాడు. ఇక్కడ ఆటోల వారిదే ఆధిపత్యం. మొదటి ప్రాముఖ్యత వారికే. ముఖ్యంగా మొన్న జరిగిన రొట్టెల పండుగ సమయంలో లక్షలాది మంది ప్రయాణికులు నెల్లూరు స్టేషన్ నుండి రాకపోకలు సాగించారు. వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రయాణికుల ద్వారా కోట్ల రూపాయలు ఆర్జిస్తూ ఇలా వారిని కష్టాల పాలు చేయడం సబబు కాదు. అసలు ఇక్కడ ఏం జరుగుతోంది..? ప్రయాణికుల బాధలు ఇబ్బందులు ఏమిటి ..? ఇంకా ఈ కష్టాలు ఎన్నాళ్ళు ..? వంటి విషయాలపై సమగ్రసమాచారం సేకరించి మన 'లాయర్' పాఠకులకు తెలియపరిస్తే బాగుంటుంది.

*ఆర్.పి.రామయ్య,* కొండాయపాలెం.

# ఎందరో దాతలు..అందరికీ అభివందనాలు

జిల్లాలో అనేక దురదృష్టకర సంఘటనల్లో తీవ్ర కష్ట నష్టాలకు గురవుతున్నవారికి, నిరుపేదలకు, రోగులకు, వృద్ధాశ్రమాల వారికి ఇలా ఎంతోమంది బాధితులకు ఎందరో దాతలు ఆర్థికసాయం అందిస్తుండడం నిత్యం పత్రికల్లో చూస్తుంటే ఎంతో సంతోషం కలుగుతోంది. జిల్లాలో దాతలకు కొదవ లేదని, దాతలకు నెరదాతలకు మన జిల్లా పుట్టినిల్లని నిరూపించుకుంటున్నారు. అంతేకాదు, కోవూరు తదితర నియోజకవర్గాల్లో పలువురు ప్రజాప్రతినిధులు కూడా లక్షలాది రూపాయలను సైతం బాధితుల కోసం సాయం చేస్తుండడం అపూర్వం. ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవడం, ఆకలైన వారికి అన్నం పెట్టడం మానవతా ధర్మం. అంతకన్నా పుణ్యం ఏముంటుంది?.. జిల్లాలో అలాంటి మహనీయులెందరో ఉన్నందుకు గర్వంగా కూడా ఉంది. వారి సేవలు అపారం. వారి దాతృత్వం అపూర్వం!...ఎందరో దాతలు..అందరికీ అభివందనాలు!..

*ఆనంద్ సాయి,* పడుగుపాడు.

# మురికి కూపంగా జలదంకి

మండల కేంద్రమైన జలదంకి మురికికూపంగా తయారైంది. ప్రధాన రోడ్లు సైతం చెత్తాచెదారాలతో నిండిపోయి దుర్వాసన వెలువరుస్తున్నాయి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు వచ్చిపోయే ఆర్టీసీ బస్టాండ్ వద్ద అడుగడుగునా చెత్త పేరుకుపోయి గబ్బుకొడుతోంది. గత కొద్దిరోజులుగా ఈ చెత్తకుప్పల నుంచి భరించలేనంత దుర్గంధం వెలువడుతోంది. వానకు తడిసి మురుగుదిబ్బలుగా రోడ్లు మారిపోతున్నా, వాహనాల రాకపోకలకు కూడా అంత రాయంగా ఉన్నా ఏ అధికారీ వాటిని తొలగించేందుకు ప్రయత్నించకపోవడం విచారకరం. *– బిఆర్ సుకుమార్,* జలదంకి.




# ఆత్మకూరులో మెగా రక్తదాన శిబిరం

మండల కేంద్రమైన ఆత్మకూరులో ఇటీవల లయన్స్ క్లబ్ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముందస్తుగా పట్టణంలోని త్రికోటేశ్వర కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఈ రక్తదాన శిబిరంలో 70 మంది దాతలు రక్తదానం చేయడం విశేషం. రక్తదాతలకు లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ మెంటా వెంకటేశ్వర్లు, సెక్రటరీ సున్నా సంతోష్ కుమార్, ట్రెజరర్ సోమిశెట్టి కిరణ్‌కుమార్‌లు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించిన లయన్స్‌క్లబ్ సభ్యులను స్థానిక ప్రముఖులు సన్మానించారు.

# గోశాలలో గోవుల మృతి బాధాకరం

నెల్లూరుజిల్లా దుత్తలూరు మండలం నర్రవాడ శ్రీ వెంగమాంబాదేవి ఆలయ గోశాలలో 150 ఆవులు ఉన్నాయని, అయితే వాటికి గడ్డి కొరత మూలంగా తిండి లేక బక్క చిక్కి పోతున్నాయని, నెల రోజుల్లో మూడు ఆవులు మృతి చెందగా, ఇటీవల మరొక ఆవు అనారోగ్యంతో మృతి చెందిందని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఒక వినతిపత్రంలో తెలియజేశారు. ఆవులు ఆకలితో అలమటిస్తున్నాయని, శుష్కించి పోతున్న ఆవులను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆవుల ఆరోగ్యం దెబ్బతింటే సకాలంలో వైద్యం అందించే పరిస్థితులు కూడా లేవని, కలెక్టర్ ఈ విషయాన్ని వెంటనే పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సిద్ధార్థ స్కూల్‌లో ఇండిపెండెన్స్ డే



మండల కేంద్రమైన అల్లూరులోని సిద్ధార్థ స్కూల్‌లో 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు సంబరంగా జరిగాయి. మండల విద్యాశాఖ అధికారి సునీత జాతీయపతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణికుమార్, కెనరా బ్యాంకు మేనేజర్ సందీప్‌రెడ్డి, విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, స్కూల్ కరెస్పాండెంట్ హనుమాచార్యులు పాల్గొన్నారు. నూకలపాటి రమాతమ్మ వార్షిక బహుమతి ప్రదానోత్సవంలో ఇటీవల టెన్త్‌లో మొదటి రెండుస్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 10వేలు, రూ. 5వేల వంతున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. తిక్కవరపు సందీప్‌రెడ్డి వార్షిక బహుమతిగా తృతీయ స్థానం పొందిన విద్యార్థికి రూ.3వేలు బహుకరించి విద్యార్థులందరినీ అభినందించారు.

## అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలి

విద్యార్థులు విద్యలో బాగా రాణించి అన్ని రంగాల్లో ముందుండాలని దొరవారి సత్రం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.పార్వతి అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆగస్టు15న జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి రావాలని, కళాశాలకు, తల్లిదండ్రులకు, దేశానికి మంచిపేరు తేవాలని కోరారు. ఒమేగా ప్రేయర్ మినిస్ట్రీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ పి.గ్లోరీ మాట్లాడుతూ, విద్యార్థి దశనుంచే కష్టపడి చదువుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ రాజేశ్వరి, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, మినిస్ట్రీ ట్రెజరర్ సిరి పాల్గొన్నారు.

## వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వొద్దు

**జిల్లా ఎస్పీ డా.కె.తిరుమలేశ్వరరెడ్డి**

ప్రజలు, ముఖ్యంగా యువత తమ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వవద్దని, ఫోటోలను సోషల్‌మీడియాలో ఉంచవద్దని, వాటితో సైబర్‌నేరగాళ్లు బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశమందిరంలో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో మాట్లాడుతూ, ఆన్‌లైన్ వ్యాపారాలు, ఉద్యోగాల పేరిట సులభంగా డబ్బు సంపాదించవచ్చునే ఆశచూపి మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అంతేకాక, చీటీల పేరుతో డబ్బు కట్టించుకోవడం, ప్రేమ పేరుతో మోసగించడం, నకిలీపత్రాలతో బురిడీ కొట్టించడం మోసగాళ్ళకు నిత్య కృత్యమైందని, వీటన్నిటిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## దళితులపై దాడులు ఆపండి

**-టిడిపి ఎస్సీ సెల్ ధర్నాందోళన-**

రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని, ఇకనైనా ప్రభుత్వం దళితులపై దాడులను అరికట్టాలని టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి ప్రసాదరావు కోరారు. ఈనెల 14న నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగిన దళితుల ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులివ్వకుండా ప్రభుత్వం దళితులను ఇబ్బందిపెడుతోందని, ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను కూడా పక్కదారి పట్టించారని ఆయన విమర్శించారు. దళితుల కోసం కేటాయించిన సంక్షేమపథకాలను వెంటనే అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ఆమేరకు వినతిపత్రం అందజేశారు.

## పంట కాలువలా.. దోమల నిలయాలా?

**సిపిఎం విమర్శ**

నెల్లూరు చెరువు నుంచి వచ్చే పంట కాలువలు పూర్తిస్థాయిలో వ్యర్థపదార్థాలతో నిండిపోయి మురుగు కాలువల్లాగా తయారయ్యాయని, దోమల నిలయాలుగా కాలువలు మారిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14న నగరంలోని 47, 48, 49, 50 డివిజన్లలో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ, ఉయ్యాల కాలువ, రామిరెడ్డి కాలువ, గచ్చు కాలువల్లో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెలువరిస్తున్నాయని, ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మురుగుతో ఈగలు, దోమలు ప్రబలిపోయి కాలువ పరిసరాల్లో పేద ప్రజలు రోగాలబారిన పడుతున్నారని, వెంటనే మురుగును తొలగించాలని కోరారు.

# వాడవాడలా.. మువ్వన్నెల జెండా రెపరెపలు

***ఆగస్టు 15న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటే సంబరంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్యవీరులను స్మరించుకున్నారు. దేశాన్ని తెల్లదొరల బానిసబంధనాల నుంచి విముక్తి చేసేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుకు తెచ్చుకున్నారు. విద్యార్థులు, యువత ఊరూరా జాతీయ పతాకాలను ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకున్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో జిల్లా ఉన్నతాధికారులు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేశారు. నగరంలోని పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో అనేక పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. దేశభక్తుల వేషధారణలతో చిన్నారుల ప్రదర్శనలు సందడిగా సాగాయి. ప్రభుత్వ శాఖల ప్రగతిని చాటుతూ శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది.***





## పారదర్శక పాలనకే పెద్దపీట

**- మంత్రి అంబటి**

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి అహరహం కృషి చేస్తున్నారని, పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తూ, అభివృద్ధి పథంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి నవరత్నాల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి ఎన్నో పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15వ తేది మంగళవారం ఉదయం నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జిల్లా ఎస్పీ డా.కె. తిరుమలేశ్వరరెడ్డిలతో కలసి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు జాతీయ జెండాను ఎగురవేసి అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. దేశం కోసం అసువులు బాసిన త్యాగధనులను విస్మరించరాదన్నారు. పారదర్శకతతో కూడిన సుపరిపాలనలో భాగంగా శాస్త్ర సాంకేతిక సహాయంతో నూతన విధానాలను అనుసరిస్తూ గ్రామాలు, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని తెలిపారు. అవినీతి రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం అకుంఠిత దీక్షతో పనిచేస్తోందని చెప్పారు. రైతులకు వేలాదికోట్ల రూపాయల వ్యయంతో ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా జరుగుతున్న అనేక అభివృద్ధి పనులను ఆయన ఈ సందర్భంగా వివరించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులు కె.వి చలమయ్యను మంత్రి శాలువతో సన్మానించారు.

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సింహ, అడిషనల్ ఎస్పీలు హిమవతి, జి.శ్రీనివాసరావు, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబసభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### జిల్లా కోర్టులో...



నెల్లూరులోని జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆగస్టు 15న జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని జాతీయపతాకాన్ని ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా అదనపు జడ్జిలు జి.కబర్థి, సత్యవాణి, తేజోవతి, శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి బాలాజీ, లోక్‌అదాలత్ జడ్జి వాణి, పలు కోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అదేవిధంగా, కోర్టు ప్రాంగణంలో నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్వాతంత్ర్యవేడుకలను జరుపుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి జాతీయపతాకాన్ని ఎగురవేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా, ఉపాధ్యక్షుడు సుబానీ తదితరులు పాల్గొన్నారు.

### విఎస్‌యులో...



నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆగస్టు 15న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.యం సుందర వల్లి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ మాటలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశం నాకేం చేసింది అని కాక, నేను దేశానికి ఏం చేశాను..అని అందరూ ఆలోచించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వాతంత్ర్యయోధులను స్మరించుకున్నారు. విఎస్‌యు ఇంటర్ కాలేజీ ఆటలపోటీల్లో పాల్గొని పతకాలు సాధించి, కళాశాల కీర్తిని నిలబెడుతున్న విద్యార్థులను ఆమె అభినందించారు. విఎస్‌యు రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.రామచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.విజయ ఆనంద కుమార్‌బాబు తదితరులు పాల్గొనారు.

### కలెక్టరేట్‌లో...



దేశ స్వాతంత్రం కోసం అసువులు బాసిన మహనీయుల త్యాగాలను మరువలేమని, వారిని అందరం స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తొలుత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. పోలీస్ అధికారులచే గౌరవ వందనం స్వీకరించారు. స్వయంగా చిన్నారులకు చాక్లెట్స్ పంచిపెట్టారు. జిల్లా ప్రజానీకానికి, ప్రజా ప్రతినిధులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా, డిఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఏ.ఓ షఫీ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

### జగనన్న భవన్‌లో...



నెల్లూరు జేమ్స్ గార్డెన్‌లో ఉన్న జగనన్న భవన్‌లో జిల్లా వైకాపా సీనియర్ నాయకులు దార్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈనెల 15న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు. నగర డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్లమూడి చంద్ర, రాజగోపాల్, చింతల రాజేష్, రవి, కార్తిక్, మీరా, బాబు, నన్నెజాన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### కొండాయపాళెం ప్రాథమిక పాఠశాలలో...



నెల్లూరులోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని వేడుకగా జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక నాయకులు టి. సురేష్, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సుప్రియ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హరీష్, రాశి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# నెల్లూరు కబుర్లు

## ఆకట్టుకున్న సీఫుడ్ ఫెస్టివల్



నెల్లూరులో ఇటీవల మూడురోజుల పాటు సీఫుడ్ ఫెస్టివల్ ఉత్సాహంగా జరిగింది. ఈ నెల 13తో ముగిసిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. నెల్లూరు జిల్లాతో పాటు ఒంగోలు, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందినవారు పాల్గొని వివిధ రకాల సీఫుడ్‌ను ప్రదర్శనలో ఉంచారు. మొత్తం 24 స్టాల్స్ ఏర్పాటుచేశారు. వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలను ప్రదర్శనకు పెట్టారు. ప్రత్యేకించి వారు తయారుచేసిన చేపలు, రొయ్యల కూరలు సీఫుడ్ ప్రియులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు, వారి తల్లితండ్రులు అధికసంఖ్యలో పాల్గొని వివిధ రకాల చేపలను తిలకించి ఆనందించారు. మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు సారథ్యంలో జరిగిన ఈ ఫెస్టివల్ చివరి రోజున జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీ వేంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరులోని సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. బాలాజీనగర్‌లోని రైస్‌మిల్లు ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలో మాజీమంత్రి నారాయణ దంపతులు పాల్గొని స్వామివారికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ముత్యాల తలంబ్రాలు అందజేశారు. ధార్మికసంస్థ వ్యవస్థాపకులు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలతోనే.. స్వాతంత్ర్యం



ఎందరో మహనీయుల త్యాగాలతోనే మనదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని దేశపురోభివృద్ధికి బాటలు వేయాలని నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ అన్నారు. ఆగస్టు 15న కళాశాల ప్రాంగణంలో జరిగిన 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యయోధుల త్యాగనిరతిని ఆయన స్మరించుకున్నారు. భారతీయ పౌరునిగా మన ఇంటినే కాకుండా, మన ఊరు, మన దేశం బాగుండాలనే లక్ష్యంతో ప్రతిపౌరుడు బాధ్యతతో ప్రవర్తించాలన్నారు. అనంతరం, కళాశాల ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్, అధ్యాపకులు తదితరులు విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేసి అందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకట్టుకున్న..'డిజిటల్ ఇండియా' సెల్ఫీబూత్




స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ఎంజీబీ మాల్‌లో ఆగస్టు 15న భారత ప్రభుత్వ క్షేత్రప్రచార కార్యాలయం-నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డిజిటల్ ఇండియా సెల్ఫీబూత్ అందరినీ ఆకట్టుకుంది. మాల్‌కు వచ్చినవారంతా ప్రధాని మోదీ బొమ్మతో డిజిటల్ ఇండియా స్టాల్‌లో ఫోటోలు దిగడానికి ఆసక్తి చూపారు. భారత ప్రభుత్వ క్షేత్రప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీ వరకు మాల్‌లో ఈ స్టాల్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచారు.

## 99వ సారి అజయ్‌బాబు రక్తదానం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ కార్యాలయంలో బ్లడ్ సెంటర్ కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు తన తండ్రి చంద్రగిరి నారాయణ జ్ఞాపకార్థం ఆగస్టు 14వ తేదీన 99వసారి రక్తదానం చేశారు. అజయ్‌బాబు మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల మరో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చని, యువత ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.



## ఇరుకళలమ్మకి రూ. 8.34 లక్షల రాబడి

నెల్లూరు గ్రామదేవత, భక్తుల కొంగుబంగారంగా నెల్లూరు చెరువు గట్టున వెలసివున్న చల్లనితల్లి శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఇటీవల హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఏప్రిల్ 26 నుంచి ఆగస్టు 9వ తేది వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా అమ్మవారి ఆలయానికి 8 లక్షలా 43 వేలా 368 రూపాయలు రాబడి వచ్చినట్లు ఆలయ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు (ఆర్‌ఎస్‌ఆర్) తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ కార్య నిర్వహణాధికారి బొగ్గల మల్లికార్జున్‌రెడ్డి, దేవాదాయశాఖ అధికారి సుధీర్, అల్లూరు ఇఓ చిట్టిబాబు, ఆలయ ట్రస్ట్‌బోర్డ్ సభ్యులు రాచూరు రమేష్‌యాదవ్, కందుకూరు వెంకటేశ్వర్లు ఆచారి, చిన్నా, ప్రధాన అర్చకుడు పులికొలను చంద్రశేఖర్, దైవజ్ఞస్వామి, జయస్వామి, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

## వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వండి



అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల సమాఖ్య కోశాధికారి దేవిరెడ్డి రమణారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 13న నెల్లూరులోని పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో జరిగిన గ్రామీణ రెవిన్యూ సహాయకుల ఐక్యసంఘం రాష్ట్రస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా బాలచెన్నయ్య, మహిళా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, గౌరవాధ్యక్షునిగా మీరామొహిద్దీన్, ప్రధాన కార్యదర్శిగా చాన్‌బాషా, సహాయ ప్రధాన కార్యదర్శిగా రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. కొత్తకార్యవర్గాన్ని నాయకులు అభినందించి సన్మానించారు.

## 'తంగిరాల మహాభారతం' 68వ భాగం




ఇక ధర్మరాజు రాజసూయ యాగం ప్రారంభించాలని సంకల్పించినప్పుడు, ఆప్త మంత్రులు ఆ యాగ నిర్వహణకు నీవే అర్హుడవని ప్రోత్సహిస్తారు. శ్రీకృష్ణుడు కూడా వచ్చి, ఇక సందేహించకుండా యాగాన్ని ప్రారంభించమని, నీకిష్టమయిన విధి నిర్వహణలో ఆజ్ఞాపించమని కోరతాడు. ధర్మరాజు సహదేవుడికి యజ్ఞానికి అవసరమయ్యే పనులు చూసుకోమని, నకులుణ్ణి కౌరవ ప్రముఖులను ఆహ్వానించి, తోడు పెట్టుకురమ్మని చెపుతాడు. కౌరవ బంధువులు రాగానే, భీష్మ, ద్రోణ, కృప, విదుర, అశ్వద్ధామ, దుర్యోధన, దుశ్శాసనులకి తగిన విధి బాధ్యతలనిస్తాడు ధర్మరాజు. దేశదేశాల నుంచి మహారాజులు, విప్రప్రముఖులు, వేదవ్యాసుడు, ఆతని శిష్యులు, నారద మునీంద్రుడు, ఇంకా గొప్ప మునివర్యులు వస్తారు. రాజసూయ యాగం పైలిని, ధౌమ్యుని ఆధ్వర్యంలో, శ్రీకృష్ణుని పర్యవేక్షణలో విజయవంతంగా జరుగుతుంది. ధర్మరాజు విచ్చేసిన రాజులని అత్యంత గౌరవంతో సత్కారం చేసి, ఎన్నో దాన ధర్మాలు చేసి, పంచభక్ష్య పరమాన్నాలతో అందరిని తృప్తి పరచి, వాళ్ళ అభిమానాన్ని చూరగొంటాడు.


**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




## ఉత్తమ దర్శకుడు.. 'కళాంజలి అనంత్'

### 'పండుటాకులు'కు రెండు జాతీయ అవార్డులు ఉత్తమ నటునిగా ధనుంజయ


'కళాంజలి' అనంత్


ధనుంజయ

నెల్లూరుకు చెందిన 'కళాంజలి' అనంత్ సారథ్యంలో రూపొందించిన 'పండుటాకులు' రెండు జాతీయస్థాయి అవార్డులు సాధించింది. వృద్ధుల జీవితాలను హృద్యంగా వివరించే ఈ షార్ట్‌ఫిల్మ్ అందరి అభినందనలు అందుకుంది. ఉత్తమ దర్శకునిగా కళాంజలి అనంత్, ఉత్తమ నటుడిగా ధనుంజయ ఈ అవార్డులను అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో 'వీ వరల్డ్ స్టూడియోస్' ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన షార్ట్‌ఫిల్మ్‌ల పోటీల్లో 'పండుటాకులు'కు ఈ అవార్డులు లభించడం విశేషం. ప్రముఖ సినీనటుడు గిరిబాబు తనయుడు బోసుబాబు, నటి జగదీశ్వరిల చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. నటునిగా, దర్శకునిగా, టెలిఫిల్మ్‌ల రూపకర్తగా అనంత్ ఇప్పటికే అనేకమంది ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. ఇటీవల అనంత్ ఆధ్వర్యంలోని 'లక్ష్మీ క్రియేషన్స్' ద్వారా ఈ 'పండుటాకులు' షార్ట్‌ఫిల్మ్‌ను నెల్లూరు నటులతోనే రూపొందించారు. ప్రముఖ రంగస్థల నటులు ధనుంజయ, బెనర్జీ, పార్వతీశం, కెకెఆర్ మూర్తి, డా.తేజ, ఎం.ప్రసన్నాంజనేయులు, డా.చెన్నకేశవులు ఈ షార్ట్‌ఫిల్మ్‌లో విలక్షణమైన పాత్రలు పోషించారు. గుంటూరుకు చెందిన నటి లహరి మినహా ఇందులో నటులు, సాంకేతికగణం అందరూ నెల్లూరీయులు కావడం విశేషం. సంగీత్‌సౌరభ్, చైతన్యల సంగీతం, కెమెరామెన్ క్రిస్టోఫర్ ఛాయాగ్రహణం ఫిల్మ్‌కు పరిపుష్టతను చేకూర్చాయి. మాటలు రాసింది కెకెఆర్ మూర్తి. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం అంతా కళాంజలి అనంతే. రెండు జాతీయస్థాయి అవార్డులు సాధించిన అనంత్‌ను నెల్లూరు కళాకారులందరూ అభినందిస్తున్నారు.







## 'మాట-పాట-ఆట'ల సమాహారంగా...

## అన్నమయ్య సంకీర్తనా గానాలతో

# పులకించిన నెల్లూరు

## అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ - శ్రీసిటీ శ్రీవాణి ఆధ్వర్యంలో సరికొత్త రీతిలో 'అన్నమయ్య సంకీర్తనావళి'

'అర్థం-ఆలాపన-అభినయం'..అనే ఈ మూడు ప్రక్రియల సమాహారంగా, అన్నమాచార్యుల వారి సంకీర్తనల భావాలు అర్థమయ్యేవిధంగా ఆ భావ వ్యక్తీకరణతో, ఆ కీర్తనలను హృద్యంగా ఆలాపించే టిటిడి గాయకుని మధుర గానాలాపనతో, ఆ కీర్తనల్లోని భావాలకు, గానానికి తగ్గట్టుగా అభినయిస్తూ అత్యద్భుతంగా నృత్యం చేసే చిన్నారుల నాట్యాభినయంతో.. మొత్తంగా ఒక వినూత్నమైన కళాత్మక ప్రదర్శనల సుమాహారంగా, గతంలో ఎప్పుడూ లేనంత ప్రత్యేకతను సంతరించుకుని ఏర్పాటైన 'అన్నమయ్య సంకీర్తనావళి' కార్యక్రమం భక్తజనులను ఆనందపరవశులను చేసింది. అన్నమయ్య సంకీర్తనల్లోని భావాలే మాటలుగా, పాటలుగా, నాట్యాలుగా మారి ప్రేక్షకులను మంత్రముగ్ధులను గావించిన



ఈ విశిష్టమైన కార్యక్రమం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తద్వారా నెల్లూరు ప్రజలు నిండుభక్తితో అన్నమయ్యకు అసలైన నివాళులర్పించినట్లయింది. నెల్లూరులోని శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవ కమిటీ-శ్రీసిటీలోని శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 12వ తేది శనివారం సాయంత్రం జరిగిన ఈ సరికొత్త వేడుక అన్నమయ్య జయంతి ఉత్సవాన్ని మరింత దేదీప్యమానం చేసింది. అన్నమయ్య సంకీర్తనలకు భూమన్ అర్థం చెప్పగా, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు కె.సరస్వతీ ప్రసాద్ గానాలాపన చేయగా, స్థానిక గురుకృప కళాక్షేత్రం చిన్నారుల నాట్యాభినయంతో ఆద్యంతం ఈ కార్యక్రమం అందరినీ అలరించింది.



జ్యోతిప్రకాశనం చేస్తున్న సన్నారెడ్డి రాజగోపాల్‌రెడ్డి

'మాట-పాట-ఆట'ల ముచ్చటైన కలయికతో అన్నమయ్య సంకీర్తనలకు సంబంధించి 'అర్థం-ఆలాపన-అభినయం' అనే కొత్త ప్రక్రియకు నెల్లూరులోని శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవ కమిటీ-శ్రీసిటీలోని శ్రీవాణి ఆధ్యాత్మిక సాహిత్య వేదికలు పాదులు వేశాయి. శ్రీసిటీ-శ్రీవాణి సంస్థ ఇటీవలే తొలిసారిగా శ్రీసిటీలో శ్రీకారం చుట్టిన ఈ ప్రక్రియను నెల్లూరులోని అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ అందిపుచ్చుకుని దానికి మరింత పరిపుష్టిని చేకూర్చింది. అందుకు నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని అన్నమయ్య సర్కిల్, పివిఆర్ కల్యాణమండపం వేదికలయ్యాయి. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తండ్రి సన్నారెడ్డి రాజగోపాలరెడ్డి, భూమన్, విశ్రాంత ఓయస్డీ సిహెచ్ పెంచలరెడ్డి, 'లాయర్' అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి తదితరులతో జ్యోతి ప్రకాశన అనంతరం, కుమారి జ్ఞానశ్రీ ప్రార్థనా గీతంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 614వ జయంతిని పురస్కరించుకుని దాదాపు మూడు గంటల పాటు నయనమనోహరంగా సాగిన ఈ కార్యక్రమంలో టిటిడి 'శ్వేత' మాజీ డైరెక్టర్, సుప్రసిద్ధ సాహితీవేత్త, రాయల సీమకు నీటికోసం అక్షర పోరాటం సాగించిన వ్యక్తి, ప్రస్తుత టిటిడి ఛైర్మెన్ భూమన కరుణాకర్‌రెడ్డికి సొంత అన్న భూమన్ (భూమన సుబ్రహ్మణ్యంరెడ్డి) ఈ వేడుకలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు, దాదాపు 32వేల సంకీర్తనా సుమాలతో ఆ తిరుమలేశుని ఆజన్మాంతం అర్చించిన మహాభక్తుడు శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వారి జయంతి వేడుక సందర్భంగా భూమన్ ప్రవచనం అందరినీ ఆలోచింపజేసింది. అన్నమయ్య కేవలం భక్తకవి మాత్రమే కాదని, సామాజిక చైతన్యానికి పాటుపడిన ప్రజాకవి అని ఆయన అన్నారు. ఆయన రచించిన వేలాది సంకీర్తనల్లో నాటి సామాజిక స్థితిగతులన్నీ పూసగుచ్చినట్లు అభివర్ణించారని, ఆ కోణంలో కూడా అన్నమయ్య సంకీర్తనలను పరిశీలించినప్పుడే అన్నమయ్యకు నిజమైన నివాళులర్పించినట్లవుతుందని అన్నారు. అన్నమయ్య కీర్తనలు వెలుగులోకి తెచ్చేందుకు తిరుమల తిరుపతి దేవస్థానాల వారు చేసిన కృషి అపారమని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నమయ్య రాసిన పలు కీర్తనల్లోని సామాజిక చైతన్య భావాలను భూమన విశ్లేషించారు. ఆ కీర్తనలను టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు, నెల్లూరీయుడైన కె.సరస్వతీప్రసాద్ అత్యద్భుతంగా గానం చేస్తుండగా, స్థానిక గురుకృప కళాక్షేత్రం చిన్నారులు ఆ కీర్తనలకు తగ్గట్టుగా మనోహరంగా నాట్యాభినయం చేసి అందరి కరతాళధ్వనులందుకున్నారు. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, చక్కని తల్లికి చాంగుభళా, కలికాల మహిమా, ఏ కులజుడైన నేమి, ముద్దుగారే యశోద, 'వేడుకుందామా వేంకటగిరి వేంకటేశ్వరుని'..వంటి సుప్రసిద్ధ సంకీర్తనలను ఎన్నిక చేసుకుని ఈ ప్రదర్శనను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం, నిర్వాహకులు ఈ సంగీత నృత్య కార్యక్రమంలో పాల్గొన్న కళకారులను, చిన్నారులను ఘనంగా సత్కరించారు. గురుకృప కళాక్షేత్రం అధినేత్రి గాయత్రి శిష్యురాళ్ళయిన బాలమ్మ, తేజస్వినిలను సీనియర్ న్యాయవాది నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి సన్మానించారు. భూమన్ సతీమణి..శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి ఆచార్య కుసుమకుమారిని విశ్వసాయి కళాశాల ఛైర్‌పర్సన్ రుక్మిణి ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ ముఖ్య సమన్వయకర్త శివప్రభాత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు హజరత్‌బాబు, కార్యనిర్వాహక సభ్యులు కృష్ణకిశోర్, పెంచలరెడ్డి, బలరామయ్యనాయుడు, హేమంతకుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రయ్యచౌదరి, శోభన్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రాజ్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, కళాంజలి అనంత్, బెనర్జీ, సురేష్, విజయకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విచ్చేసిన భక్తులందరికీ కమిటీ గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్న ప్రసాదాలు అందజేశారు.

## ఇదొక విలక్షణమైన కార్యక్రమం - తుంగా శివప్రభాత్‌రెడ్డి



అన్నమాచార్యులవారి సంకీర్తనలకు అర్థం, ఆలాపన, అభినయం అనే ప్రక్రియలతో నిర్వహించే ఈ కార్యక్రమం విలక్షణమైనది, అద్భుతమైనదని అన్నమాచార్య జయంత్సువ కమిటీ ముఖ్య సమన్వయకర్త, 'లాయర్' పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి చెప్పారు. పూర్వకాలంలో కవులు రాజాస్థానాలను ఆశ్రయించేవారని, వారిచ్చే కానుకలతో విలాసంగా గడిపేవారని, ఈ నేపథ్యంలో ఆ కాలంలోనే రాజులను సైతం కాదని, జీవితాంతం దైవాన్నే నమ్మి తమ రచనలను ఒక దివ్యార్చన కళగా ఆ భగవంతునికి అర్పించిన మహాకవి తాళ్లపాక అన్నమాచార్యుల వారని ఆయన కొనియాడారు. భక్తిమార్గం ద్వారా సంఘసంస్కరణకు, ప్రజాచైతన్యానికి పాటుపడిన ప్రజాకవి అన్నమయ్య అని, 32వేల సంకీర్తనలతో ఆ తిరుమలేశునికి ఆ మహనీయుడు చేసిన అక్షరార్చన.. ఆ భక్తితత్వం, సామాజిక అంశాల పట్ల అన్నమయ్యకు ఉన్న దార్శనికత్వం అపూర్వమని అన్నారు. తొలిసారిగా ఇటీవల శ్రీసిటీలోని శ్రీవాణి సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చూసి, నెల్లూరులో కూడా ఏర్పాటుచేస్తే బావుంటుందనే ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహించామని, ఆ వినూత్న ప్రక్రియలో ఇది రెండవదని తెలిపారు.



నాట్య గురువులను సన్మానించి అభివందనం చేస్తున్న సీనియర్ న్యాయవాది నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డి

**అన్నమయ్య - సామాజిక దృక్పథం**

**భూమన్ ప్రసంగ పాఠం..** 9లో



భూమన్ సతీమణి కుసుమకుమారిని సత్కరిస్తున్న విశ్వసాయి ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణి






# 'శ్రీ శంభు భారతము' కావ్యావిష్కరణ

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రి వైద్యులు, ప్రముఖ కవి డాక్టర్ శింగరాజు శ్రీరామకృష్ణప్రసాదరావు (సింహరాజ్) రచించిన 'శ్రీ శంభు భారతము' పద్య కావ్యావిష్కరణ ఈనెల 14న స్థానిక టౌన్‌హాలులో జరిగింది. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఈ కావ్యాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ పెద్ద కుమారుడైన ఛత్రపతి శంభాజీ మహారాజ్ వీరచరిత్రను పద్యకావ్యంగా అత్యద్భుతంగా రచించిన డాక్టర్ సింగరాజు కృషి అభినందనీయమన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రాణాలను ధారబోసిన మహనీయుడు, ధర్మవీరుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ అని, అలాంటి మహావీరుల చరిత్రను అందరూ తెలుసుకోవాల్సి ఉందని అంటూ, శంభాజీ మహారాజ్ మహోన్నత త్యాగనిరతిని డాక్టర్ సింగరాజు పద్య రూపంలో హృద్యంగా వివరించారని ప్రశంసించారు. ప్రముఖ సారస్వతవేత్త ఉన్నం జ్యోతివాసు ఈ కావ్యాన్ని సమీక్షించారు. పద్యసారస్వత పరిషత్ నిర్వాహకులు పోలవరపు లక్ష్మీనరసింహా రావు పర్యవేక్షణలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సింహపురి ధార్మిక సంస్థ వ్యవ స్థాపకులు ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ బాలు సుబ్బారావు, ప్రముఖ సాహితీవేత్త డా.చీమకుర్తి వెంకటేశ్వరరావు, శతావధాని కొండపి మురళీకృష్ణ, విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, విద్వాన్ సూరం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో వేడుకగా జెండా పండుగ



అంతర్జాతీయ ఖ్యాతిపొందిన శ్రీసిటీ పారిశ్రామిక వాడలో ఆగస్టు 15న 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఆనందోత్సాహాలతో జరిగాయి. స్థానిక బిజినెస్ సెంటర్ ప్రాంగణం వద్ద జరిగిన ఈ వేడుకల్లో శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్ జాతీయపతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు. శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్‌నాయక్ స్వాతంత్ర్య సమరంలో ఎందరో యోధులు పడ్డ బాధలు, త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించిందని, ప్రభుత్వ చర్యలను బలోపేతం చేస్తూ ప్రతిఒక్కరు ఆ మార్గంలో ముందుకు సాగాలని కోరారు. శ్రీసిటీ వేగవంతమైన అభివృద్ధిని ప్రశంసిస్తూ, వెనుకబడిన ప్రాంతంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలను అందించడానికి శ్రీసిటీ యాజమాన్యం చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబానికి 77వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మన దేశాన్ని అత్యుత్తమ దేశంగా మార్చడానికి మరియు స్వేచ్ఛ, శాంతి, ఐక్యతతో సంతోషంగా జీవించేందుకు అనువైన మంచి ప్రదేశంగా మార్చడానికి అందరూ కంకణబద్ధులు కావాలని కోరారు. ప్రభుత్వ 'మేక్ ఫర్ వరల్డ్' పథకానికి అనుగుణంగా, వివిధ రంగాలలోని 200 తయారీ పరిశ్రమలకు నిలయంగా మారడంతో పాటు ఉద్యోగాల కల్పనకు ఉత్తేజాన్ని ఇవ్వడం, ఆర్థిక వ్యవస్థను వేగవంతమైన మార్గంలోకి తీసుకెళ్లడం వంటి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా శ్రీసిటీ తనవంతు కృషి చేస్తోందన్నారు. శ్రీసిటీ సెక్యూరిటీ విజిలెన్స్ హెడ్ వై.రమేష్, వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొని, విధుల్లో విశేష సేవలకు గుర్తింపుగా శ్రీసిటీలోని పలు కంపెనీలకు చెందిన 20 మంది సెక్యూరిటీ అధికారులు, గార్డులకు, హౌస్ కీపింగ్, ల్యాండ్‌స్కేపింగ్ విభాగాలకు చెందిన మరో 20 మందికి 'ఉత్తమ పనితీరు' అవార్డులు అందచేశారు.



# ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆగస్టు 15న 77వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి జెండా ఎగురవేసి స్వాతంత్ర్యవీరుల సేవలను కొనియాడారు. గౌరవ అతిథిగా 10 ఆంధ్ర నావెల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్‌రామచంద్రన్ పాల్గొన్నారు. ఎన్‌సిసి, ఆర్మీ, నేవీ విద్యార్థుల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ జి.మాధవయ్య, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# కోవూరులో సిపిఎం ప్రచార జాతా

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీలు పడి ప్రజలపై పన్నుల భారం పెంచుతున్నాయని, దీంతో సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారుతోందని సిపిఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కోవూరులో ఈనెల 14న జరిగిన ప్రచారజాతాలో నాయకులు వెంకమరాజు, దయాకర్, శేషయ్య, బాబు తదితరులు పాల్గొని ప్రభుత్వాల తీరును నిరసించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# డీఎస్పీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం




గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో హరిప్రియ దంత వైద్యశాల వారు ఉచిత దంత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసులకు, వారి కుటుంబసభ్యులకు ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని, ఆరోగ్య భద్రత కింద ప్రతి పోలీసు దాదాపు 30,000 రూపాయలు చెల్లించడం జరుగుతుందని, పోలీసులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. అనంతరం హరిప్రియ దంతవైద్యశాల వాళ్ళు పోలీసులకు మెడికల్ కిట్లు అందించారు. గూడూరు రూరల్ సీఐ దశరథ రామారావు, టూటౌన్ సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగులకు చేయూతగా రెడ్డి సంఘం



ఈ నెల 13వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ దాతృత్వంతో 'సిద్దారెడ్డి జనార్దన్‌రెడ్డి దివ్యాంగుల చేయూత' కార్యక్రమం నిర్వహించి, 20 మంది దివ్యాంగులకు పల సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మల్లెమాల హరికరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. సంఘ వ్యవస్థాపక ఉపాధ్యక్షులు బుస్సారెడ్డి దశరథరామిరెడ్డి, శ్రీకిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, సిద్దారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సనత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ డీఇగా ప్రసాద్



ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరుజిల్లాలోని విద్యుత్‌శాఖ సర్కిల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించినందుకు గాను డీఇ ఎల్.ప్రసాద్‌కు ఉన్నతాధికారులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. గూడూరు నియోజకవర్గంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ డి.ఈ ఎల్.ప్రసాద్‌కు అవార్డు రావడం పై సంతోషం వ్యక్తం చేస్తూ... రానున్న కాలంలో ఆయన మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

# పుష్కరిణికి నీటి వసతి

గూడూరులోని శ్రీ కోదండరామాంజనేయస్వామి వారి దేవస్థాన పుష్కరిణికి నీటి వసతి కోసం మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ భూమి పూజ జరిగింది. ధూర్జటి గోపాలకృష్ణ, పసుపులేటి కిషోర్, శివకుమార్, భాస్కర్‌రావు, మాల్యాద్రి, ఇంద్రవర్ధన్‌ల దాతృత్వంతో బోరు వేశారు. దేవస్థాన ఛైర్మెన్ తాళ్లూరు శ్రీనివాసులు, మానవతా ఛైర్మెన్ బుస్సారెడ్డి దశరథరామిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, కిరణ్ చక్రవర్తి, పి.వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలు అందించినందుకు గాను తిరుపతిలో ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖామాత్యులు, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణస్వామి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్.

# త్రివర్ణ అలంకారంలో ఆంజనేయస్వామి



గూడూరు రెండో పట్టణ పరిధిలోని సిరామిక్ ఫ్యాక్టరీ రోడ్డులో వెలసిన శ్రీ ఆంజనేయస్వామిని స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాక అలంకారంలో అలంక రించారు. సీత, రామ, లక్ష్మణులను త్రివర్ణ వస్త్రాలతో, శ్రీ ఆంజనేయస్వామి వారిని వస్త్రాలు, తలపాగా, మూలవిరాట్టు వెనుక అశోకచక్ర రూపాన్ని ఏర్పాటు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. సిరామిక్ యూత్ ట్రస్టు సభ్యులు భక్తులకు వసతులు కల్పించారు.




ఈ నెల 15వ తేదీ గూడూరులో జరిగిన 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సేవలందించినందుకు గాను గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, ఆర్‌డీవో కిరణ్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న అరవ పార్వతయ్య, జేవీవీ సభ్యులు.

## అన్నమయ్య కీర్తనలు ఎలా బయటపడ్డాయంటే

ఎప్పుడో 14వ శతాబ్దంలో అన్నమయ్య రచించిన సంకీర్తనలు దాదాపు 500 సంవత్సరాల పాటు మనకు అందుబాటులో లేవని, అవి బయటపడడం వెనుక పెద్ద కథే ఉందని ఈ సందర్భంగా భూమన్ చెప్పారు. అన్నమయ్య రచించి గానం చేసిన 'చందమామ రావో'..జాబిల్లి రావో', 'జో అచ్యుతానంద జోజో ముకుందా' అనే సంకీర్తనలు తప్ప ఇతర కీర్తనలేమీ ఎంతోకాలంగా ప్రజలకు తెలియవని, 1920–21 ప్రాంతంలో తిరుమల తిరుపతి దేవస్థానాల పేష్కార్‌గా ఉన్న సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి పుణ్యమా అంటూ అవి వెలుగులోకి వచ్చాయని ఆయన వివరించారు. టిటిడికి సంబంధించిన 1530వ శాసనంలో తిరుమల ఆలయంలోని శ్రీవారి హుండీకి ఉత్తరదిక్కున ఒక అర ఉందని తెలుసుకుని, ఆ అరను కనుగొని అందులో ఉన్న అపురూపమైన అన్నమయ్య సంకీర్తనలను ఆయన వెలికి తీయించారన్నారు. అపారమైన సాహితీసంపద ఉన్న ఆ అరకు టిటిడి వారు ఎంతో భక్తితో 'అరలుప్పాడ్' అనే ఉత్సవాన్ని నేటికీ నిర్వహిస్తుండడం విశేషమని, ఆ సందర్భంగా 'జయహో' అనే శబ్దాన్ని కూడా వినిపిస్తారని భూమన్ వివరించారు. శ్రీ వేంకటేశ్వరస్వామిని నిత్యం నిద్రపుచ్చేటప్పుడు అన్నమాచార్యుల వారి వారసుడు అన్నమయ్య సంకీర్తనను గానం చేస్తాడని, తాళ్లపాక వంశస్థుడైన 'తాళ్ళపాక హరినారాయణ' తిరుమల దేవాలయంలో ఆ కార్యక్రమాన్ని నేటికీ నిర్వహిస్తుండడం ఒక అద్భుతమని చెప్పారు. అన్నమయ్య సంకీర్తనలన్నిటినీ అన్నమాచార్యులవారి పెద్ద కుమారుడైన పెద తిరుమలాచార్యులవారు అచ్యుత రాయల కాలంలో రాగిరేకులపై చెక్కించారని ఆయన పేర్కొన్నారు. అన్నమయ్య అర ద్వారా..అలా ఆ సంకీర్తనల రాగిరేకులు బయటపడిన తర్వాత టిటిడి వారు అన్నమాచార్య ప్రాజెక్టును ఏర్పాటుచేసి వేటూరి ప్రభాకరశాస్త్రి, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, ఉదయగిరి శ్రీనివాసాచార్యుల వంటి ప్రసిద్ధ పండితులతో వాటిని గ్రంథస్తం చేయించారని, ప్రతి కీర్తనకు వ్యాఖ్యానం కూడా రాయించారని తెలిపారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి వాటిని ఒక పుస్తకరూపంలోకి తెచ్చారని ఆయన గుర్తుచేశారు. అన్నమయ్య సతీమణి తాళ్లపాక తిమ్మక్క తొలి తెలుగు కవయిత్రిగా పేరొందారని, ఆ కాలంలోనే ఆమె రాసిన 'సుభద్రా కల్యాణం' నేటికీ ఎంతో విశిష్టమైనదని అన్నారు. అదే విధంగా, నెల్లూరు సీమకు చెందిన మహాకవి, మహాభారతాన్ని ఆంధ్రీకరించిన తిక్కన కూడా ఎన్నో అద్భుతమైన తెలుగు పదాలను వెలుగులోకి తెచ్చారన్నారు. తిరుమలేశుని భక్తురాలు తరిగొండ వేంగమాంబ సాహిత్యంపై నెల్లూరుకు చెందిన సారస్వతవేత్త, వెంకటగిరి రాజా సాయికృష్ణ యాచేంద్ర ఇటీవలి కాలంలో అపూర్వమైన పరిశోధనలు చేశారని తెలిపారు. ఏదేమైనప్పటికీ అన్నమయ్య సంకీర్తనలపై ఇంకా మరింత లోతుగా విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని ఆయన అంటూ, అప్పట్లో ఎన్నెన్నో ఊళ్ళు తిరుగుతూ సంకీర్తనలు రచించిన అన్నమయ్య, దివ్యమైన శ్రీరంగనాథక్షేత్రం వెలసి ఉన్న నెల్లూరుకు రాకుండా ఉంటారా?..ఆ దిశలో కూడా సాహితీ పరిశోధకులు పరిశోధన చేయాల్సి ఉందని సూచించారు.



# అన్నమయ్య - సామాజిక దృక్పథం

*అన్నమయ్య సమాజ కవి. ఆనాటి సామాజిక జీవనం నుంచి ఆయన ఎప్పుడూ వేరుపడలేదు. నాటి ప్రజల జీవన స్థితిగతులను పూర్తిస్థాయిలో అధ్యయనంచేసి ప్రజల భాషలో పదకవితలు రచించి పదకవితా పితామహుడిగా అన్నమయ్య పేరొందారు. భక్తకవిగానే కాక ఆయన ప్రజాకవిగా చిరస్థాయి కీర్తి పొందారు. ఆ మహనీయుని సంకీర్తనలు అపూర్వం, అజరామరం.*

**- 'అన్నమయ్య' జయంతి సభలో భూమన్ ప్రసంగ పాఠం**



అన్నమాచార్యుని కాలం నాటికి తెలుగు సాహితీరంగంలో పద్యకవితకు పట్టాభిషేకం జరుగుతోంది. పద్యాలు రాసే కవి పరమ పూజనీయుడు. పద్యమే కవితకు పరమావధి. అప్పటికే శ్రీనాథుడికి కనకాభిషేకం జరిగింది. పోతన 'మందార మకరందాలను' తెలుగు ప్రజలకందిస్తున్న పద్యం పండిత లోకానికే పరిమితమైంది. అయితే, ఆ కాలంలో సామాన్య ప్రజలకు అర్థమయ్యే, ఉపయోగపడే రీతిలో కవిత్వం లేకపోవడం విచారకరం. జానపద కవితా రీతులున్నప్పటికీ వాటికి పండితలోకంలో ప్రాధాన్యత లేదు. పద కవితలను పండితులు ఈసడించుకున్న కాలం అది. అలాంటి కాలంలో, దాదాపు ఆరువందల సంవత్సరాల క్రితమే పదానికి పట్టం కట్టి, చదువులేని.. చదువురాని పల్లెప్రజల నోళ్ళల్లో పదాలను కుమ్మరించి, వారినోట పలికించి, వారి హృదయాల్లో చోటుచేసుకున్న పదకవితా పితామహుడు అన్నమయ్య. సంస్కృతంలో 'సంకీర్తన లక్షణం' అనే లక్షణ గ్రంథాన్ని రాసిన మహాకవి అన్నమయ్య, సామాన్యుల కోసం గంటం పట్టడంలోనే ఆయన సామాజిక దృక్పథాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఆనాడు జానపదుల వాడుకలో ఉండిన జాజరులు, చందమామ, తుమ్మెద, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాలి, లాల, జోల, శోభన, తందనాలు, చాంగుభళాలు మొదలైన ఎన్నో వరుసలను ఆయన తన పదకవితల్లో ఉపయోగించి తెలుగు భాషకు కొత్త వెలుగులద్దారు.

## ప్రజల కోసం గళమెత్తిన కవి :

అన్నమాచార్యుల వారు తన కాలంనాటి ప్రజల భాషను, వారి పలుకుబళ్లను, నానుళ్ళను, సామెతలను తన రచనల్లో ఉపయోగించడం ఆయన సామాజిక దృక్పథానికి మరింత వన్నెతెచ్చింది. రచనకు సామాజిక ప్రయోజనం ఉందని విశ్వసించిన అన్నమయ్య, ప్రతి పదాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలోనే రచించడం ఒక ప్రత్యేకత. కవిత్వం అందరికీ అర్థం కావాలన్నదే ఆయన సిద్ధాంతం. ఒక కవి ప్రజల వైపు ఉన్నాడా లేదా తద్భిన్నంగా ఉన్నాడా అన్నది ఆ కవి ఉపయోగించే భాషను బట్టి ఇట్టే తెలిసిపోతుంది. భాషతో పాటుగా నాటి సమాజంలోని అన్ని వర్గాల వారిని పాత్రలుగా చేయడంతోనే ఆ కవి దృక్పథం మనకు అర్థమవుతుంది. నాటికాలంలోని అన్ని వర్గాల ప్రజలు తమ యాసాభాషలతో సజీవంగా దర్శనమిస్తారు అన్నమయ్య రచనల్లో. పల్లెల్లోని గొల్లెతలే కాదు, అటవీ ప్రాంతాల్లోని చెంచితలు కూడా అన్నమయ్య రచనల్లో కనిపిస్తారు. చల్లలమ్మిన పల్లెపడుచులు, మందులమ్మడానికి వచ్చిన నాగరీకులు కూడా ఉన్నారు. రైతులున్నారు, మాలదాసర్లు ఉన్నారు. వారివారి వృత్తిపరమైన భాష ఉంది. వారుపయోగించిన మాటలున్నాయి. నానుడులున్నాయి. 'ఆడిన మాటెల్ల అమృతకావ్యంగా, పాడిన పాటెల్లా ఒక పరమగానంగా' జీవించి తరించిన వారు అన్నమయ్య. ఒక్క మాటలో చెప్పాలంటే, తెలుగు సాహితీ ప్రపంచంలో అన్నమయ్య లాగా ఇంత సమగ్రంగా ప్రజల జీవితచిత్రణలు చేసిన వారు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు.

## రాజును సైతం ధిక్కరించిన వైనం :

అనన్యభక్తి పారవశ్యంతో శ్రీ వేంకటేశ్వరాంకితంగా సంకీర్తనా సుమాలతో దేవదేవునికి పాదార్చన చేస్తున్న అన్నమయ్యను నాటి రాజు సాళువ నరసింహరాయలు తనపై కూడా కీర్తనలు రాయమన్నందుకు నిర్ద్వందంగా తిరస్కరించిన ధీర కవి అన్నమయ్య. తాను రాస్తున్నది రాజాశ్రయం కోసం కాదని, ధనధాన్యాల కోసం కూడా కాదని, కేవలం ప్రజల కోసం, భక్తికోసమని చెప్పాడన్నమయ్య. అందుకు రాజాగ్రహానికి గురై, బందీ అయినా వెరవలేదు. లొంగలేదు. తాను నమ్మిన ఆశయానికి కట్టుబడి ఉన్నాడు. అంతేకాదు, నాటి రాచరిక వ్యవస్థలో రాజ్యకాంక్షతో ఒకరినొకరు హతమార్చుకోవడం చూసి ఖిన్నుడైన అన్నమయ్య 'దేహమిచ్చిన వాని దివిరి చంపెడివాడు.. ద్రోహిగాక నేడు దొర యటా' అని ఆవేదన చెందాడు. ఇదేమి కలికాల మహిమా అని దు:ఖించాడు. నాటి రాజరిక వ్యవస్థలోని ద్రోహచింతనలను నిరసించాడు. కులవ్యవస్థను కాదన్నాడు. ఏ కులజుడైన నేమి..నిక్కమెరిగిన మహాన్వితుడే ఘనుడన్నాడు. అన్నమయ్యలోని మరో ప్రత్యేకత ఎక్కడా స్త్రీని నిందాపూర్వకంగా పేర్కొనకపోవడం. తన ఆత్మ స్త్రీమూర్తిగా, పరమాత్మ నాయకుడుగా భావించి ఆత్మ పరమాత్మలో సమైక్యం కావాలని చేసిన ప్రయత్నమే అన్నమయ్య శృంగార కీర్తనలు. సామాజిక జీవనంలో స్త్రీకి సమానమైన ప్రాతినిధ్యం ఇచ్చాడు అన్నమయ్య. ఆయన భార్య తాళ్లపాక తిమ్మక్క గొప్ప కవయిత్రి. మన తొలి తెలుగు కవయిత్రి ఆమే. దీన్నిబట్టి అన్నమయ్య స్త్రీలకు ఎంత గౌరవం ఇచ్చారో తెలుస్తుంది. పిల్లల్ని బడుల్లో కొట్టడం, హింసించడం తగదన్నాడు. నాటి ఘోరమైన విద్యావిధానాన్ని నిరసించాడు. 'కోదండమున వ్రేల వేసి, కోల గగ్గెర దోసి, గుంజిళ్లు పెట్టించి, బడి పెట్టుపెట్టే చదువుకున్నా, సర్పపు కాటే నయమ'న్నాడు.

## రైతుల మాటలే.. అన్నమయ్య పదాలు

రైతుల మాటలైతే అన్నమయ్య పదాల్లో లెక్కేలేదు. చేటలు, గంపలు, వాములు, మూటలు, మోపులు, కల్లం వంటి మాటలెన్నో ఉన్నాయి అన్నమయ్య సంకీర్తనల్లో. పోడు నరకడం, దున్నడం, పదును కోసం ఎదురుచూడడం, విత్తనాలు విత్తడం, కలుపు తీయడం, ఎరువులు వేయడం, ధాన్యాన్ని గాదెల్లో పోయడం, రుచికరమైన వంటకాలు చేసుకోవడం వంటివన్నీ ఉన్నాయి. ఆయా కాలాల్లో వచ్చిన కరువులు, వాటి వల్ల ప్రజలు పడిన బాధలూ ఉన్నాయి. ఆ కాలంలోని ఆటలు పాటలు, తోలుబొమ్మలు, వామనగుంటలు, బొమ్మల పెళ్ళిళ్ళు, చదరంగం, అల్లనేరెళ్ళు ఇలాంటివి బోలెడు. ఇడ్డెనలు (ఇడ్లీలు), రాజాన్నాలు, ఆవకాయ ప్రస్తావనలు, కారెపు పీడెము (కిళ్లీలు) వంటివి కూడా ఉన్నాయి. ఆ కాలంలో ఎలాంటి మంచాలుండేవో, వాటికి ఎలాంటి దోమతెరలు కట్టేవారో కూడా వివరంగా ఉన్నాయి. ఇవన్నీ అన్నమయ్య తమ సంకీర్తనల్లో ఏర్చికూర్చారు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అంటూ అందరికీ ఆ దేవదేవుడిపై భక్తిని కలుగజేస్తూ రాసిన సంకీర్తనలు నాటి ప్రజల్లో పెద్దఎత్తున ఆధ్యాత్మిక చింతన కలిగించాయి. మానవులంతా ఒక్కటే అనే భావంతో, తరతమ భేదాలు ఉండకూడదనే ఆశయంతో ఆయన సంకీర్తనలు వెలయించారు. 'కందువగు హీనాధికములిందు లేవు / అందరికీ శ్రీహరే అంతరాత్మ!..ఇందులో జంతు కులమంతా ఒకటే / అందరికీ శ్రీహరే అంతరాత్మ'..అంటూ సమతాభావం చాటారు. శ్రీవేంకటేశ్వరునిపై అనన్యభక్తితో ఆయన రాసిన సంకీర్తనలు, సామాజికంగా వెలువరించిన సంకీర్తనలు కూడా వేలాదిగా ఉన్నాయి. వాటన్నిటిపై ఇంకా పరిశోధనలు జరగాలి. అన్నమయ్య సంకీర్తనలకు మరింత వెలుగు రావాలి. మరింతగా అవి వెలుగులోకి రావాలి. అదే నా ఆకాంక్ష!....

## టూకీగా...



### చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో వెలసి వున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారికి ఈనెల 13 ఆదివారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నేత్ర పర్వంగా పూలంగిసేవ నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### కురుచెర్లపాడు అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు

వెంకటాచలం మండలంలోని కురుచర్లపాడు పంచాయతీలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు పలువురు దాతలు ఈనెల 13న 40 కుర్చీలను తమ వితరణగా ఇచ్చారు. దాతలు వీరేపల్లి రామచంద్రయ్యనాయుడు, యరబల్లి శ్రీనివాసులు వాటిని వైకాపా జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య చేతులమీదుగా ఆ కేంద్రాలకు అందజేశారు.

### కోకావారిపాలెంలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

వింజమూరు మండలంలోని కోకావారిపాలెంలో పామాయిల్‌తోటల్లో పేకాటస్థావరంపై పోలీసులు ఈనెల 13న దాడిచేసి 8 మంది పేకాటరాయుళ్ళను పట్టుకున్నారు. వారి నుంచి 30,170 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సిహెచ్ కోటిరెడ్డి తెలిపారు.

### బద్దెవోలులో సంగమేశ్వరునికి మాసశివరాత్రి పూజలు

మనుబోలు మండలంలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డులో ఉన్న శ్రీ సంగమేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 13న మాసశివ రాత్రి పూజలను వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రదోషకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### రాపూరులో ఘనంగా గంగమ్మ జాతర

మండలకేంద్రమైన రాపూరులో ఈనెల 13న గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

### ముదివర్తిలో 'నా భూమి-నా దేశం'

విడవలూరు మండలం ముదివర్తిలో పంచాయతి కార్యదర్శి సుమంత్ ఆధ్వర్యంలో ఇటీవల 'నా భూమి–నా దేశం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్యయోధులను స్మరించుకుని, అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపిటీసీ సౌందర్య, ఎన్ఆర్‌జిఎస్ ఏపిఓ సోఫియా, ఫీల్డ్ అసిస్టెంట్ కోటయ్య, సచివాలయ వలంటీర్లు పాల్గొన్నారు.

### మాలకొండస్వామికి రూ.10.84 లక్షల ఆదాయం

కందుకూరు నియోజకవర్గం వలివేటివారిపాలెం మండలం మాలకొండలో వెలసివున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి ఈనెల 12 శనివారం ఒక్కరోజునే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా 10,84,729 రూపాయలు రాబడి వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

### పెంచలకోనలో నిత్యాన్నదానానికి లక్ష విరాళం

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలం పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానానికి ఇటీవల చెన్నైకి చెందిన అన్నడిశెట్టి మల్లికార్జున–ప్రవీణ దంపతులు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులకు ఆ మొత్తాన్ని అందించగా, అర్చకులు దాతలను ఆశీర్వదించారు.

### కుల్లూరులో చెత్తసంపద కేంద్రం తనిఖీ

కలువాయి మండలంలోని కుల్లూరులో చెత్తనుంచి సంపద తయారుచేసే కేంద్రం పనితీరు ఎలా ఉందో సంబంధిత మండల అధికారి పార్లపల్లి సునీల్‌రెడ్డి, పంచాయతి కార్యదర్శి రమేష్‌బాబు తనిఖీ చేశారు. దాని నిర్వహణ వివరాలను సిబ్బందినడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన కలిగించారు. చెత్తను రోడ్లపై వేయవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

# మజా ఇస్తున్న మత్తు.. పల్లె యువత చిత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే 4.84 లక్షల మంది గంజాయికి బానిసలుగా మారారని ఇటీవల కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ స్థాయీ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఇందులో 10 నుండి 17 ఏళ్ల మధ్య వయసు గలవారు 21,000 మంది ఉన్నారన్నది వొళ్ళు గగుర్పొడిచే వాస్తవం. గంజాయి కాకుండా ఇతర మాదకద్రవ్యాలను సేవిస్తున్న బాలలు 3.17 లక్షల మంది ఉన్నారని కూడా ఆ నివేదిక చెప్తోంది. రాష్ట్రంలో మొత్తం 20.19 లక్షల మంది వివిధ రకాల మాదకద్రవ్యాలకు బానిసలుగా మారగా ఇందులో 3.17 లక్షల మంది బాలలు ఉండడం కలవరం కలిగించే అంశమే. గంజాయి వినియోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ 12వ స్థానంలో, ఓపియడ్స్ సేవించే వారి జాబితాలో 10వ స్థానంలో, సెడేటివ్స్‌కు అలవాటు పడిన వారి జాబితాలో 8వ స్థానంలో ఉండడం దిగ్భ్రాంతికరమైన అంశం. దేశం మొత్తంమీద గంజాయి సరఫరాలో విశాఖ అగ్రస్థానంలో నిలవడం రాష్ట్రానికి చెరగని అప్రతిష్ట. మాదకద్రవ్యాల వినియోగం అత్యధికంగా ఉన్న జిల్లాల్లో ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలున్నాయి.

## క్షణికావేశం ఖరీదు నిండు ప్రాణాలు!

మత్తుకు బానిసలై క్షణికావేశంలో చెలరేగుతున్న ఘర్షణల్లో విలువైన ప్రాణాలు పోతున్నాయి. మత్తు మహమ్మారే కత్తుల్లా మారి పచ్చని కుటుంబాల్లో నెత్తుటి గాయాల్ని మిగిలిస్తోంది. మాదకద్రవ్యాల మత్తులో కట్టుకున్న భార్యను స్నేహితులకు అమ్మిన భర్త, మత్తుకు బానిసై అప్పుల పాలై కూతురి ప్రాణం తీసిన తండ్రి, మత్తులో అతివేగంగా కారు నడిపి ప్రాణాలు కోల్పోయిన యువకుడు, మాదకద్రవ్యాలు దొరకడం లేదనే ఆందోళనతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి. మత్తుకు బానిసై అర్థాంతరంగా ప్రాణాలు విడిచిన యువతి.. వంటి వార్తలు ప్రతిరోజూ పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో మనం చూస్తున్నవే. ఈ మత్తుకు బానిసగా మారి, తాను పతన మవడమే కాకుండా తమ కుటుంబాలను కూడా రోడ్డున పడేస్తున్నారు.

పేద, ధనిక, మధ్య అనే తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ మత్తులో పడి దొర్లుతున్నారు. ఒక పేదవాడు గంజాయికి బానిసై కుటుంబాన్ని రోడ్డుకు లాగి, చివరకు ఏమీ చేయలేక ఆత్మహత్య చేసుకుంటుంటే, ఒక మధ్యతరగతి వాడు చెడు అలవాట్లకు బానిసై తన స్తోమతకు మించి కొనుగోలుచేసి అప్పులపాలై చావలేక, బతకలేక తాను నలిగిపోతూ కుటుంబాన్ని కూడా ఛిద్రం చేస్తున్నాడు. ఇక ధనికులు వాళ్ల స్థాయికి తగ్గట్టు దురలవాట్లతో అదే స్థాయిలో హింసాత్మక ఘటనలకు దిగుతున్నారు. మాదకద్రవ్యాల వల్ల మానసిక, శారీరక, సామాజిక, ఆర్థిక ఇబ్బందులతో పాటు సంక్రమిస్తున్న రాక్షస ప్రవృత్తి శాంతిభద్రతల సమస్యలను తీసుకొస్తోంది. మత్తుకు బానిసలైన వారి మన స్తత్వం ఎంత కరడుగట్టి ఉంటుందో చెప్ప డానికి ఎన్నో వాస్తవ సంఘటనలు మనకు ఉదాహరణకు కనపడుతూనే ఉన్నాయి.

## పల్లెలపై ప్రభావం!

ఇప్పుడు మత్తు ప్రభావం పల్లెలపై పడింది. ఓ వైపు ఈ తరహా మాదకద్రవ్యాలకు లొంగినవారు తమ జీవితాలను పతనం చేసుకుంటుంటే... మరోవైపు డ్రగ్ అడిక్ట్ అయిన వారి అవసరాలు తీర్చడం కోసం కొంతమంది యువత ఈ వ్యాపారంలో దిగడం గమనార్హం. మత్తుపై మోజుతో ఒక రకంగా తమ జీవితాలు నాశనం చేసుకుంటుంటే, డబ్బుపై ఆశతో మరో రకంగా తమ భవిష్యత్తును తాకట్టుగా పెట్టి ఈ వ్యాపారం కొనసాగిస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసినా వాళ్లకు దొరకకుండా తమ పిల్లలను వారి తల్లితండ్రులే కాపాడే స్థాయిలో ఈ వ్యాపారం డబ్బు సంపాదించి పెడుతుందని ఒక గ్రామ పెద్ద వాపోవడం ఇక్కడ విశేషం. "మా ఊళ్లో యువతకు ఉద్యోగాలు లేవు, కాంట్రాక్టు పనులు లేవు, ప్రభుత్వ పథకాలు వాళ్లకి రావు... మరేం చేస్తారు, డబ్బు సంపాదన కోసం వాళ్ళ దారి వాళ్ళు వెతుక్కున్నారు" అంటూ ఆ గ్రామ పెద్ద నిట్టూర్చాడు. ముంబై, హైదరాబాదు, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలలోనే ఉండనుకున్న ఈ సంస్కృతి, ఇప్పుడు ఆంధ్రాలో గ్రామాలకి కూడా పాకిపోయిందన్న ఆందోళన చాలామంది అమ్మానాన్నల నుండి వ్యక్తం అవుతోంది.

## అనర్థాలపై అవగాహన కలిగించడమే ముఖ్యం!

కనీసం భవిష్యత్ తరాలనైనా ఈ మత్తుకు దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలంటే, యువతకు పాఠశాలల్లో చిన్నవయసు నుంచే పదేపదే వీటి వల్ల జరిగే అనర్థాల గురించి బోధించాలి. అమ్మా నాన్నలు కూడా చిన్నతనం నుండే తమ పిల్లలను నైతిక విలువలతో పెంచాలి. సమాజం పట్ల వారికి నైతిక బాధ్యత అలవడేలా వారిని తీర్చి దిద్దాలి. వాళ్ల పిల్లలను ఎప్పుడూ ఓ కంట కనిపెడుతూ ఏ మాత్రం వారి ప్రవర్తన తీరు అనుమానంగా ఉన్నా వెంటనే వారికి కౌన్సిలింగ్ చేయాలి. వ్యాయామం, ధ్యానం, ఆధ్యాత్మికత వంటి అలవాట్లు చిన్నతనం నుంచే వారిలో అబ్బేలా ప్రోత్సహించాలి. మాదకద్రవ్యాలకంటే కిక్ నిచ్చే విషయాలు ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఒక మంచిపని చేసినప్పుడు, సాటి మనిషికి అవసరంలో సహాయం చేసినప్పుడు వచ్చే ఆనందం, కిక్కు ఎన్ని మాదకద్రవ్యాలు తీసుకున్నా రాదు. వీటి గురించి బాల్యం నుండే వివరించగలగాలి. పిల్లల్లో ఒక్కొక్కరికి ఒక్కో అంశంపై ఆసక్తి ఉంటుంది. ఆ ఆసక్తిని గమనించి ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తుండాలి. ప్రభుత్వ పాలకులను, వ్యవస్థలను, అధికారులను నిందించు కుంటూ కూర్చుంటే నష్టం మనకే. మన పిల్లల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. వారిని రక్షించుకునే ప్రేమ అనే ఆయుధం మన దగ్గరే ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కన్నా, అసలు చేతులే కాల కుండా చేసుకోగలిగిన అవకాశం మనకి ఉంది. తల్లితండ్రులూ ఆలోచించండి..! మీ బిడ్డల బంగారు భవిష్యత్తుకి మీరే బాటలు వేయండి...!!

# కాంట్రాక్ట్ అధ్యాపకుల జీవితాల్లో.. కొత్త వెలుగులు

వేలాదిమంది కాంట్రాక్ట్ అధ్యాపకుల కుటుంబాల్లో వెలుగులు ప్రసరించే విధంగా వారి ఉద్యోగాలు రెగ్యులర్ అయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో ఇది మరపురాని రోజని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 2014 జూన్ నాటికి అయిదేళ్లు పూర్తిచేసుకున్న ప్రతి కాంట్రాక్ట్ అధ్యాపకుడిని రెగ్యులర్ చేస్తున్నట్లుగా సిఎం ప్రకటించడం హర్షదాయకమన్నారు. దీంతో స్థానిక కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఆయన ఇటీవల 'థ్యాంక్యూ సీఎం' కార్యక్రమం ఏర్పాటుచేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 10 వేల మందికి పైగా కాంట్రాక్ట్ అధ్యాపకుల జీవితాలకు భరోసా ఇచ్చినట్లయిందన్నారు. అసోసియేషన్ నాయకులు సునీల్‌శర్మ, సాయికిరణ్, రామాంజనేయులు, కిరణ్‌కుమార్, వంశీగౌతమ్, సురేష్‌కుమార్, కిషోర్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# చలమయ్యకు సన్మానం



ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు కె.వి.చలమయ్యను ఆగస్టు 15న పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన స్వాతంత్ర్యవేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు సన్మానించారు.

# కూరగాయల సాగుపై తీసుకుంటున్న చర్యలేమిటి?

## --- రాజ్యసభలో ప్రశ్నించిన బీద మస్తాన్‌రావు ---



ఉద్యాన పంటలు(హార్టీకల్చర్), కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని ఇటీవల రాజ్యసభలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) ప్రశ్నించారు. అధిక విలువ కలిగిన తోటల పెంపకం, కూరగాయలు, చేపల పెంపకం, పౌల్ట్రీ మరియు డెయిరీతో పోల్చితే గోధుమ, బియ్యం వంటి ధాన్యాల భారీ ఉత్పత్తి చాలా తక్కువ విలువను సృష్టిస్తుందనేది వాస్తవం కాదా?.. అలా అయితే, ఉద్యాన పంటలు, కూరగాయల సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారని ఆయన అడిగారు.

అందుకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ సమాధానమిస్తూ ధాన్యం పంటలతో పోలిస్తే ఎక్కువ విలువతో పాటు, లాభదాయకమైన ధరలను అందించే ఉద్యాన పంటలు, కూరగాయల సాగు కోసం రైతులను ప్రోత్సహించడానికి కేంద్రం ఎంతగానో కృషిచేస్తోందన్నారు. రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందించడం, హార్టీకల్చర్ యాంత్రీకరణ, దేశంలో ఉద్యానవన రంగాన్ని ప్రోత్సహించడానికి పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మౌలిక సదుపాయాల సృష్టికి చర్యలు తీసుకుంటున్నామన్నారు ఫలితంగా, హార్టీకల్చర్ రంగం 2022-23లో అత్యధికంగా 350.97 మిలియన్ టన్నుల ఉద్యాన పంటల ఉత్పత్తిని నమోదు చేసిందని, తద్వారా రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే జాతీయ లక్ష్యానికి అది గణనీయంగా దోహదపడిందని తెలిపారు.

ఇంకా, దేశీయ మరియు ఎగుమతి మార్కెట్లలో భారతీయ ఉద్యాన రంగం పోటీతత్వాన్ని పెంచడానికి ఉత్పత్తి, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, విలువ జోడింపు, లాజిస్టిక్స్ మార్కెటింగ్ మరియు బ్రాండింగ్. క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల అమలుకు వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించడంలోనూ అధునాతన పద్ధతులను అవలంభిస్తున్నామని వివరించారు.

# అర్హులందరినీ ఓటర్లుగా చేర్చండి

## కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్



నెల్లూరు నగర పాలకసంస్థ పరిధిలో అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేసేందుకు అధికారులు, సిబ్బంది తగు ప్రణాళికతో సమాయత్తం కావాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ చెప్పారు. ఈనెల 16న కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన ఎన్నికల అధికారులు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. బిఎల్‌ఓలు వారికి కేటాయించిన పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఇంటింటి సర్వేను పటిష్టంగా చేపట్టాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఇఆర్‌ఓ నిర్మలానందబాబా, దేవీకుమారి, దశయ్య, ధనుంజయ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# గౌతు లచ్చన్న చిరస్మరణీయుడు



వెనుకబడిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషిచేసిన నేత గౌతు లచ్చన్న చిరస్మరణీయులని గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి నరసింహులుగౌడ్ కొనియాడారు. బీసీల నేత గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని పొగతోటలో ఉన్న బీసీ సంఘం కార్యాలయంలో బీసీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అట్టడుగు వర్గాల వారి సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేసేవారని నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కనకట్ల రఘురాం ముదిరాజ్, కుడుముల నాగేశ్వరరావు, అన్నం నాగరాజు, పి.శ్రీరాములు, బత్తిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డ్వామా అడిషనల్ పీడీగా సుజాత

జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇటీవల ఏ.సుజాత నియమితులయ్యారు. ఆ స్థానంలో ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ నిర్మలాదేవిని మాతృశాఖకు పంపుతూ, ప్రకాశం జిల్లా కనిగిరిలో డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ)గా పనిచేస్తున్న సుజాతను నెల్లూరులో నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది.



## 'అరసం' గౌరవాధ్యక్షుడిగా 'పెరుగు'

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా శాఖ ఈనెల 16న ఏర్పాటైంది. ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ గౌరవాధ్యక్షునిగా, డా.గంగిశెట్టి శివకుమార్ అధ్యక్షునిగా, కె.కరుణశ్రీ ప్రధాన కార్యదర్శిగా, అవ్వారు శ్రీధర్‌బాబు కార్యదర్శిగా నియమితులయ్యారు ఉపాధ్యక్షులుగా టేకుమళ్ళ వెంకటప్పయ్య, టీవీ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా పాయసం సుబ్రహ్మణ్యం, ఈతకోట సుబ్బారావు, కోశాధికారిగా అన్నం శివకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా డా.నీలం స్వాతి, పి.రమాదేవి, సయ్యద్ నజ్మా, మక్తాల నరేంద్ర, సుధీర్ ఎంపికయ్యారు. అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యవర్గం ఏర్పాటైంది. నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఈ డా.గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' పిల్లల కథల సంపుటిని అరసం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఆవిష్కరించారు. టేకుమళ్ళ వెంకటప్పయ్య సమీక్షించారు.

### జొన్నవాడ కామాక్షితాయికి..
## 45 లక్షలకు పైగా ఆదాయం



జిల్లాలోని ప్రసిద్ధమైన జొన్నవాడ కామాక్షి తాయి దేవాలయం హుండీ లెక్కింపు ఈనెల 16న జరిగింది. మొత్తం లెక్కమాస్తే భక్తులు సమర్పించిన కానుకల ద్వారా కేవలం 86రోజుల్లోనే 45,01,335 రూపాయల రాబడి వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

## లక్షిత కుటుంబానికి..రూ. 2 లక్షల సాయం

- నల్లపరెడ్డి శీనయ్య ట్రస్టు వితరణ



ఇటీవల తిరుమల నడక దారిలో చిరుత దాడిలో మరణించిన లక్షిత కుటుంబానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి 2లక్షల రూపాయలను సాయంగా ప్రకటించారు. ప్రసన్న తండ్రి, దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇచ్చిన ఆ మొత్తాన్ని ఈనెల 16న జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, ఏఎంసి ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి తదితరులు ఆ బాలిక తల్లితండ్రులకు అందజేశారు.

## మాదకద్రవ్యాలతో జాగ్రత్త



మాదకద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని, వాటికి అందరూ దూరంగా ఉండాలని సెబ్ ఏఇఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 16న నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న జివిఆర్ఆర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అనర్థాల పట్ల జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటుపడితే కుటుంబాలు సర్వనాశనమవుతాయని, ముఖ్యంగా యువత, విద్యార్థులు వాటి జోలికిపోకుండా శ్రద్ధగా చదువుకుని తల్లితండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్స్‌పెక్టర్ కిషోర్, డా. భాస్కర్, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాల చెరువు అభివృద్ధికి సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

నెల్లూరులోని స్వర్ణాల చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఈ చెరువును ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించారు. ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ చీఫ్ ఆర్కిటెక్ట్ కిరణ్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌లు వారితో కలిసి స్వర్ణాల చెరువు తీరాన్ని సందర్శించారు. ఇక్కడ నడక దారి, చెరువు గట్టున ప్రహరీలు తదితరాలను ఏర్పాటుచేసేందుకు పరిశీలన జరిపారు. ఎస్ఇ సంపత్‌కుమార్, ఇఇ సంజయ్, డిఇ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# మనకు ఇద్దరు ప్రధానులు కావాలి!

దేశంలో బీజేపీ (అంటే నరేంద్ర మోడీ) పాలన కొనసాగినంత కాలం... మనకు ఇద్దరు ప్రధానమంత్రులు కావాలని అనిపిస్తోంది.

'ప్రధాన మంత్రి' హోదాలో అధికారిక కార్యక్రమాలు నిర్వహించడానికి, నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ఆలోచనలు చేయడానికి, కేంద్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని నడిపించడానికి, పార్లమెంట్‌కు హాజరవుతూ.... పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మనసా వాచా గౌరవించడానికి, మొదలైన అధికారిక కార్యక్రమాలు చేయడానికి ఒక ఫుల్‌టైమ్ ప్రధాని కావాలి.

కానీ, ఇప్పుడు మనకు ఉన్నది ఫుల్‌టైమ్ ప్రధాని అనే భావం కలగడం లేదు. ప్రతిపక్ష పార్టీలపై విరుచుకుపడడం, వారి పుట్టు పూర్వోత్తరాలను హేళన చేయడం, ప్రకాష్‌రాజ్... కమల్‌హాసన్‌కు సైతం సాధ్యం కాని హావభావాలతో కూడిన అభినయంతో 'ఆత్మస్తుతి – పరనింద' సామెతను గుర్తుకు తెచ్చే రీతిలో స్వోత్కర్ష ప్రసంగాలు చేయడం 'ప్రధాని పని' కాదు. బీజేపీ పార్టీ అధ్యక్షుడి పని. లేదా పార్టీకి చెందిన ముఖ్యనేతల పని.

బీజేపీకి పూర్తి సమయం అధ్యక్షుడు ఉన్నారు. బీజేపీకి చెందినంత వరకు ఆయనే సుప్రీమ్. ఆ పార్టీయే కేంద్రంలో ప్రభుత్వ అధికార వ్యవస్థకు నేతృత్వం వహిస్తుంది. ప్రధాని పదవి నిర్వహిస్తున్న వారి కంటే కూడా బీజేపీ పార్టీ అధ్యక్షుడే సుప్రీమ్.

జే.పీ.నడ్డా అనే ఆయన బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా ఉన్నారు. బీజేపీ తరపున ఏమి చేయాలన్నప్పటికీ, మాట్లాడాలన్నప్పటికీ ఆయనే చేయాలి. కానీ, ప్రస్తుతం ఆయన డమ్మీ అయిపోయారు.

ప్రధాని పని, బీజేపీ అధ్యక్ష పని, మంత్రుల పని... అన్నీ నరేంద్ర మోడీయే నిర్వహిస్తున్నారు.

ఒక పార్టీ నేతగా దేశంలోని ప్రతిపక్షాలను డిస్ క్రెడిట్ చేసే పనికి... ప్రధాని పదవిని వాడుకుంటున్నారు. దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీలతో పాటు ఐటీ డిపార్ట్‌మెంట్‌లను ప్రతిపక్ష నేతలపై ఉసి గొలపడానికి... ప్రధాని పదవిని మోడీ వినియోగించుకుంటున్నారు. ప్రధాని హోదాలో దేశం అంతా తిరుగుతూ బీజేపీకి ప్రచారం చేయడానికి రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. ఆయన ప్రధాని హోదాలో ఉన్నారు కాబట్టి, బీజేపీ ప్రచారానికి ఆయన చేసే రాష్ట్రాల పర్యటనలు... రోడ్‌షోలకు అయ్యే భద్రతా చర్యలకు భారత ప్రభుత్వం వందల కోట్ల రూపాయల వ్యయాన్ని భరిస్తోంది.

ఒక రాష్ట్రంలో ఒక సమస్య తలెత్తితే, దానిని కొనసాగనీయడం వల్ల బీజేపీకి లాభమా... లేక... పరిష్కరించడం వల్ల బీజేపీకి లాభమా అనే ప్రధాని పదవిలో ఉన్న నరేంద్ర మోడీ ఆలోచిస్తారనే విమర్శలు వెల్లువెత్తిన అనేక ఘటనల్లో మణిపూర్ అల్లర్లు ఒకటి. అల్లర్లు మొదలైన 90రోజుల తరువాత గానీ, వాటిపై ఆయన నోరు మెదపలేదు. అక్కడ హత్యలు, గృహ దహనాలు, మానభంగాలు, కిడ్నాప్‌లు సామూహికంగా జరగడానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష... పరోక్ష పద్ధతుల్లో సహకరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ... నరేంద్ర మోడీలోని బీజేపీ నేత స్పందించలేదు. మణిపూర్‌లోని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి బీజేపీయే నాయకత్వం వహిస్తోంది.

దేశంలో గల సుమారు నాలుగు వేల శాసన సభ్యత్వాల్లో... మణిపూర్‌లో ఉన్నది కేవలం అరవై. 544 లోక్‌సభ సభ్యత్వాలలో మణిపూర్‌లో ఉన్నది రెండు. అయినా సరే... బీజేపీకి లాభం ఆ అల్లర్లు జరగడం అనే ఆలోచన కేంద్ర ప్రభుత్వాన్ని ఆవహించిందంటే... బీజేపీ ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వ యంత్రాంగ అధికారం ఏ స్థాయిలో వినియోగమవుతుందో అంచనా వేయవచ్చు.

ఈ దేశానికి నరేంద్ర మోడీ మొదటి ప్రధాని కాదు. చివరి ప్రధాని కూడా కాబోరు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్‌శాస్త్రి, ఇందిరాగాంధీ, మొరార్జీ దేశాయ్, రాజీవ్‌గాంధీ, వీపీ సింగ్, పీవీ నరసింహారావు, వాజపేయి, డాక్టర్ మన్మోహన్‌సింగ్ వంటి రాజకీయ ఉద్దండులు... ప్రధానమంత్రి హోదాలో 1947 నుంచి 2014 వరకు 67 సంవత్స






రాల పాటు దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించారు. ఒక్క వాజపేయి తప్ప, వారంతా కాంగ్రెస్‌పార్టీకి చెందినవారే.

కానీ, ఈ దేశ చరిత్ర... సంస్కృతి, అభివృద్ధి, ఆధునికత, అంతర్జాతీయ గుర్తింపు... అన్నీ కూడా 2014లో తాను ప్రధాని అయిన నాటినుంచే ప్రారంభమై... పరిఢవిల్లుతున్నట్లు ప్రధాని పదవిలో ఉన్న నరేంద్ర మోడీ చెబుతున్నారు.

బీజేపీ నేతగా ఆయన... పార్టీకి చేసుకుంటున్న ప్రచారాన్ని తప్పు పట్టాల్సిన పని లేదు గానీ, ఇందుకు ప్రధాని హోదా, అధికారం, వసతులు వాడుకోవడాన్నే ఎవరైనా విమర్శిస్తారు.

ప్రధాని పదవిలో ఉండడం వల్లనే, ఆయనకు ఎస్‌పీజీ రక్షణ కల్పిస్తోంది. ప్రధాని పదవిలో ఉండడం వల్లనే ఆయనకు భారత వాయుసేన విమానాలు, హెలికాప్టర్‌లు అందుబాటులో ఉన్నాయి. భారత ప్రధాని హోదాలో ఉండడం వల్లనే.... ఎర్రకోట బురుజుల పైనుంచి ప్రసంగించే అవకాశం లభించింది. ప్రధాని పదవిలో ఉండడం వల్లనే.... ప్రపంచంలోని మొత్తం దేశాలలో మూడవవంతు దేశాలలో 100సార్లు పర్యటించగలిగే అత్యంత అరుదైన అవకాశం లభించింది!

ఇన్ని అద్భుత, అపురూప అవకాశాలలో కూడా బీజేపీని ప్రమోట్ చేయడం ఎలా అని ఆయన ఆలోచిస్తారని విమర్శకులు ఆరోపిస్తుంటారు. ఆ విమర్శలను నరేంద్ర మోడీ పట్టించుకోరు.

రెండురోజుల క్రితం జరిగిన ఎర్రకోట ప్రసంగాన్ని కూడా 'ఆత్మస్తుతి – కాంగ్రెస్ నింద' కే ఆయన కేటాయించారు.

గతంలో దేశ ప్రధాని పదవిని అలంకరించిన పెద్దలు ఎవరూ రాజకీయ ప్రయోజనాలకు ఎర్రకోటను వాడుకున్న గుర్తు లేదు.

దేశంలోని 140 కోట్లకు పైబడి ఉన్న మొత్తం జనాభాకు ప్రాతినిధ్యం వహించే ప్రధాని పదవిలో ఉన్న నరేంద్ర మోడీ... కేవలం హిందుత్వ భావజాలానికి, శక్తులకు ప్రాతినిధ్యం వహించే బీజేపీకి మాత్రమే మనసా... వాచా ప్రాతినిధ్యం వహిస్తున్నారనేది బహిరంగ రహస్యంగా మారిపోయింది.

ప్రధాని పదవికి ఎంపికయ్యే నాయకుడు... కేవలం ప్రధాని విధులు మాత్రమే నిర్వర్తించే శుభదినం కోసం ఎదురు చూడడం తప్ప, దేశ వాసులు చేయగలిగింది ఏమీ లేదు. బీజేపీ ప్రచారానికి ప్రధాని నరేంద్ర మోడీ గత పదేళ్లుగా వాడుకుంటున్న ఎర్రకోటను బీజేపీ గానీ, హిందూ రాజులు గానీ కట్టింది కాదు.

అంతర్జాతీయ స్థాయిలో దేశానికి గర్వకారణంగా నిలిచిన తాజ్‌మహల్‌ను ముస్లిం ప్రభువు షాజహాన్ నిర్మించాడు. 1638 మే 12వ తేదీన షాజహాన్ చక్రవర్తి ఈ ఎర్రకోటకు శంకుస్థాపన చేసినట్టు చరిత్రలో నమోదై ఉంది. దీని డిజైన్ రూపకర్త కూడా ఓ ముస్లిం ఆర్కిటెక్టే. ఆయన పేరు ఉస్తాద్ అహ్మద్ లాహోరీ. తాజ్‌మహల్ రూపకర్త కూడా ఆయనే. అంతటి ఘన చరిత్ర, పరమత సహనానికి ప్రతీకగా నిలిచిన ఎర్రకోట బురుజు పైనుంచి రాజకీయ, హిందుత్వ భావనల ప్రచారానికి ఈ 140కోట్ల జనాభాకి ప్రాతినిధ్యం వహించే ప్రధానమంత్రి పదవిలో ఉన్నవారు పాల్పడడానికి మించిన విషాదం ఏముంటుంది?

అందుకే రాజకీయ, మత, ప్రాంతీయ రాగద్వేషాలు లేని నేతే ఎర్రకోట బురుజులపై నుంచి భారత జాతిని ఉద్దేశించి ప్రసంగించాలి.

నోటితో ఒకటి చెబుతూ.... చేతులతో మరొకటి చేసే నేతలను ప్రజలు ఎక్కువ కాలం భరించలేరు. అందుకు చంద్రబాబునాయుడే పెద్ద ఉదాహరణ. 2004, 2019లో చంద్రబాబును ఓడించింది ఈ మాటలు, చేతల మధ్య ఉన్న వ్యత్యాసమే. ఇప్పుడు మోడీ మాటల్లోనూ ఈ వ్యత్యాసం భారీగా కనపడుతోంది. ఈ వ్యత్యాసం ఎంత భారీగా తగ్గితే, ఆయనను ప్రజలు అంత భారీగా గుర్తు పెట్టుకుంటారు. లేకపోతే, ఆయనను... ఆయన పాలనను కేవలం బీజేపీ వారు మాత్రమే గుర్తు పెట్టుకుంటారు.

- భోగాది వేంకట రాయుడు
medhomadhanam@gmail.com

# నగరంలో మునిసిపల్ మంత్రి!







నెల్లూరు నగరంలో బివిఎస్ బాలికల పాఠశాలలో ఒక కోటి తొమ్మిది లక్షల వ్యయంతో నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంతో పాటు బాస్కెట్‌బాల్ కోర్టును రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆగస్టు 17వతేదీ గురువారం ప్రారంభించారు.

# పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా చేస్తూ జీఓ

## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన రామ్



జిల్లాలో ఎంతో ప్రసిద్ధంగా జరిగే వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జీఓ విడుదల చేశారని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఈ విషయం తెలిపారు. వెంకటగిరికి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని తాను గతంలో అడిగిన వెంటనే ముఖ్యమంత్రి స్పందించి వెంటనే ఆమేరకు జీఓ జారీచేయడం సంతోషంగా ఉందంటూ ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. వెంకటగిరి రాజుల సహకారంతో పోలేరమ్మ తల్లి జాతరను ప్రతిఏటా సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం పోలేరమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రపంచంలోనే గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉన్న తిరుమలలో..అందులోనూ ఆ తిరుమలేశుని కోవెలకు వెళ్ళే 'నడకదారి'లో ఏం జరుగుతోందన్నది..ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా ఉంది. ఇటీవల ఈ దారిలో శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి కాలినడకన వెళుతున్న నెల్లూరుజిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన లక్షిత అనే ఆరేళ్ల బాలికను అత్యంత ఘోరంగా చిరుతపులి చంపేయడం ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా పెద్ద కలకలం సృష్టిస్తోంది. భగవంతుని సన్నిధికి వెళ్లే ఆ నడకదారి మృత్యువుకు రహదారిగా మారిందా? అసలక్కడేం జరుగుతోందన్నది అందరికీ పెద్ద సంశయంగా మారింది.

# తిరుమల 'నడకదారి'లో ఏం జరుగుతోంది?..

కోవూరు మండలానికి చెందిన దినేష్‌కుమార్–శశికళ దంపతులు తిరుమలేశుని దర్శనార్థం అలిపిరి నుంచి నడక దారిలో వెళ్తుండగా అప్పటికే చీకటిపడింది. తల్లితండ్రులతో పాటు నడచివస్తున్న లక్షిత అనే ఆరేళ్ల పాప ఉన్నట్లుండి కనిపించకపోవడంతో అందరూ ఆతృతగా వెతికారు. కానీ అప్పటికే లక్షితను ఓ చిరుతపులి పట్టుకుపోయి చంపేసింది. తిరుమల నడకదారి చరిత్రలోనే కనీవినీ ఎరుగని ఘోరమిది. వందల ఏళ్ల తరబడిగా ఈ దారిలోనే భక్తులు వేలసంఖ్యలో నిత్యం వెళ్తుంటారు. ఎప్పుడూ ఇంత ఉపద్రవాన్ని ఎవరూ చూడలేదు. ఏ జంతువూ ఎవరికీ ఇంతటి హాని తలపెట్టలేదు. కానీ, ఇటీవల నడకదారి పరిసరాల్లోకి జంతువులు వస్తుండడం, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తుండడం పట్ల భక్తలోకం దిగ్భ్రాంతికి గురవుతోంది. రెండునెలల క్రితం ఓ బాలుడు కూడా ఇదేవిధంగా చిరుత బారినపడినా, అదృష్టవశాత్తూ జనం అరుపులు కేకలతో బయట పడ్డాడు. కానీ, లక్షిత ఆ అదృష్టానికి నోచుకోలేకపోయింది. బాధాకరమైన ఆ ఘటన అందరినీ కలచివేస్తూనే ఉంది.

## ఎందుకిలా ఉన్నట్లుండి?...

చిరుతపులులు, వన్యమృగాలు నడకదారిలోకి ఇటీవలి కాలంలో వస్తుండడంతో ఆ దారిన వెళ్ళే భక్తులంతా భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎప్పుడూ లేనిది ఎందుకిలా జరుగుతోంది?.. నడకదారి ప్రమాదకారిగా మారడానికి కారణాలేమిటని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఎంతో భద్రత కలిగి, ప్రశాంతతకు మారుపేరైన నడకదారిలో చిన్నపిల్లలు, పెద్దలు కుటుంబాలతో సహా దైవదర్శనకోసం ఎంతో ఉత్సాహంగా మెట్లెక్కుతూ ఉంటారు. అలాంటి దారిలో చిరుతలు, ఎలుగుబంట్లు సంచరిస్తుండడంతో ఈ దారిలో వెళ్లాలంటే భక్తులు బిక్కుబిక్కుమంటున్నారు. లక్షితపై చిరుత దాడి అందరినీ ఆవేదనకు గురిచేస్తోంది. ఇంతకాలంగా ఎప్పుడూ లేనిది.. ఇప్పుడు చిరుతపులులు అడవిలో ఉండకుండా జనంలోకి ఎందుకు వస్తున్నాయన్నదే అందరి సంశయంగా మారింది. అందుకు శేషాచలం కొండల్లో ఎర్రచందనం దొంగలు కూడా కొంతవరకు కారణం కావచ్చనే అభిప్రాయాలు వినవస్తున్నాయి. ఎర్రచందనం చెట్లను నరికేసి అక్రమంగా డబ్బు సంపాదించాలనుకునే అక్రమార్కులకు శేషాచలం కొండలు నిలయంగా మారుతున్నాయని, చెట్లను నరికే శబ్దానికి, వాహనాల శబ్దానికి జంతువులు గాభరాపడి పరుగులు తీస్తుంటాయని, అంతేకాకుండా అక్రమ మైనింగ్ కోసం శేషాచలం కొండల్లో స్మగ్లర్లు తరచూ పేలుళ్ళు జరుపుతుండడంతో పులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు భయపడి జనసంచారం ఉన్నచోటికి వచ్చేస్తున్నాయని కూడా భక్తులు అనుకుంటున్నారు. వాటి ప్రశాంతతకు భంగం వాటిల్లుతుండడంతో అవి అడవిలో ఉండలేక నడకదారి ప్రాంతాల వద్దకు వచ్చేస్తున్నాయని భావిస్తున్నారు. కారణాలేమైనప్పటికీ, నిత్యం వేలాదిమంది భక్తులు నడిచే శ్రీవారి నడకదారి భక్తులెవరికీ ప్రమాదకారి కాకూడదు. అందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానాల వారు, ముఖ్యంగా టిటిడి అటవీశాఖ, పోలీసుశాఖ వారు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవసరమైతే నిపుణుల సలహాలు తీసుకుని, రాష్ట్ర పోలీసు లేదా భద్రతాదళాల సహకారం కూడా తీసుకొని ఎలాంటి ప్రమాదాలు ఇకపై జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుకుంటున్నారు.

## పటిష్టమైన ఫెన్సింగ్ అత్యవసరం :

నడకదారికి ఇరువైపులా పటిష్టమైన ఫెన్సింగ్ ఉండాలని, అది అత్యవసరమని, భక్తుల చేతికి కర్రలు ఇచ్చినంత మాత్రాన క్రూరమృగాల నుంచి పెద్దగా రక్షణ ఉండకపోవచ్చని, ఎందుకంటే అవి ఏ వేళలో, ఏ క్షణంలో ఎటువైపు నుంచి వచ్చి మెరుపుదాడి చేస్తాయో, ఎవరిమీద పడతాయో తెలియదు కనుక, అసలు ఏ జంతువులూ నడకదారిలోకి ప్రవేశించకుండా ముందస్తుగా నియంత్రించడమే ముఖ్యమని భక్తులు సూచిస్తున్నారు. బాగా ఎత్తుగా, పటిష్టంగా, ఏ జంతువూ నడకదారిలోకి రాకుండా పెద్దఎత్తున కంచె (ఫెన్సింగ్) ఏర్పాటుచేయడంతో పాటు, అడుగడుగునా భక్తులకు భద్రత కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు.

అంతేకాకుండా, జంతువుల రాకపోకలను పసిగట్టేందుకు అవసరమైన కెమెరాలను శేషాచలం కొండల్లోనూ, తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి తిరుమల దాకా ఉండే నడకదారి పరిసరాల్లోనూ పెద్దసంఖ్యలో నిఘా కెమెరాలు ఏర్పాటుచేసి ఏమాత్రం ఏమరుపాటు లేకుండా పర్యవేక్షించాలని, ఏ జంతువు అలికిడి వినిపించినా వాటిని అదిలించేందుకు వెంటనే అప్రమత్తమయ్యే మెరికల్లాంటి భద్రతా సిబ్బంది కూడా ఉండాలని అంటున్నారు. భక్తులు ఎక్కడెక్కడినుంచో దూర సుదూరప్రాంతాల నుంచి కూడా తిరుమలకు వచ్చి నడకదారిలో వెళ్తుంటారు కనుక, ఇరవై నాలుగు గంటలూ భద్రతా దళాలు నడకదారిలో వెళ్ళే భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని, అదేవిధంగా తిరుమల కొండల్లోకి అక్రమార్కులు, ఎర్రచందనం స్మగ్లర్లు ఎవరూ రాకుండా నిరోధించేందుకు గట్టిచర్యలు తీసుకోవాలని, అన్నిదారుల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని, భారీగా భద్రతాదళాలను నియమించి భక్తులకు భరోసా కల్పించాలని కోరుకుంటున్నారు.



# నీతి తప్పింది చిరుతేనా..?

**జూన్ 22 ...**

తిరుమల కాలినడక దారిలో ఒక బాలుడిపై చిరుత దాడి..పెద్దగా అరుపులు.. రాళ్ళతో భక్తులు తిరగబడే సరికి ఆ బాలుడిని వదిలి పారిపోయిన లెపర్డ్. ఒక రోజు తరువాత ఒక చిరుతని బంధించిన అటవీ శాఖ అధికారులు. హమ్మయ్య అంటూ అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు బంధించిన ఈ చిరుత ఆ చిరుతే అని ధీమా, అందరిలోనూ నిద్రాణ స్థితి.

**ఆగష్టు 11...**

అదే కాలినడక దారిలో ఈసారి ఒక బాలికపై మళ్ళీ చిరుత దాడి. ఫలితం ఆ చిన్నారి ప్రాణం. ఇప్పుడు మళ్ళీ ఇంకో చిరుతని బంధించిన అటవీ అధికారులు. ఈ చిరుత ఆ చిరుతోకాదో తెలియదు. ఇంకా ఎన్ని చిరుతలు పొంచి ఉన్నాయో అసలే తెలియదు. మొదటిసారి దాడి చేసిన చిరుత వయస్సు ఒకటిన్నర నెల అని అధికారులే చెప్పారు. అంటే తల్లితో పాటు మిగిలిన పిల్ల చిరుతలు కూడా ఎక్కడో ఉన్నట్లేగా. మళ్ళీ ఆ మొద్దు నిద్ర వద్దు. ఇప్పటికైనా మేలుకుందాం.

టీటీడీ ఛైర్మెన్ కర్రలు ఇస్తామంటుంటే సామాజిక మాధ్యమాలలో తెగ ట్రోల్ చేస్తున్నారు. ఒక్కసారి బాలుడి ఉదంతం గుర్తు తెచ్చుకుందాం. అరుపులు, రాళ్లు ఒక ప్రాణం కాపాడింది. కర్రలు ఇచ్చినంత మాత్రాన చిరుత భయపడుతుందని కాదు, ఒక భరోసా, ఒక ప్రయత్నం.

కానీ ఆలోచించాల్సిన విషయాలు, నిలదీయాల్సిన అంశాలు చాలానే స్ఫురిస్తున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సామాజిక అటవీశాఖ నిజంగా చిత్తశుద్ధితో పనిచేస్తోందా...? చిరుతలకు సరిపడా చిన్న జంతువుల ఆహారం అడవుల్లో దొరుకుతోందా. చిన్న జంతువులకు ఆహారం దొరికేలా అవసరమైన మొక్కలు పెంచుతున్నారా? లేకుంటే రొక్కం బొక్కుతున్నారా?

గడచిన పదేళ్లలో శేషాచలం అడవుల మీద ప్రభుత్వం, టీటీడీ పెట్టిన ఖర్చు, చేసిన పనులు లెక్కలు బయటికి వస్తే కానీ బొక్కలు తెలియవు. అడవిలో ఎక్కడో ఏదో లోపం లేకపోతే వరుసగా రెండు నెలల తేడాలో రెండు చిరుతలు జనంపై దాడిచేసే పరిస్థితి రాదు. ఇన్నేళ్ళుగా లేని ఆనవాయితీ ఇప్పుడు కొత్తగా చిరుతలు అలవాటు చేసుకోవు. మనుషులంత అవినీతి, స్వార్థం వాటికి ఇంకా అంటలేదు. ఆహారం దొరక్కే చిరుత సహజ నీతి తప్పింది.

కాదు... కాదు...

చిరుత నీతి తప్పేలా మనమే ఏదో చేశాం. ఆ 'ఏదో' ఏమిటో చెప్పాల్సిన బాధ్యత టీటీడీ, అటవీశాఖ అధికారుల మీద ఉంది.

**– సూర్రెడ్డి.**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com